RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 24 సెప్టెంబర్ 2026 గురువారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:100

## 'సమయం వస్తుంది.. మిమ్మల్ని వదలం': ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ ఫైర్

**'సర్' వివాదం నేపథ్యంలో ఈసీపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు**

**'ఓటు చోరీ' రాజ్యాంగంపై దాడి అని వ్యాఖ్య**

**ఇద్దరు ఈసీల అభ్యంతరాలపై మీడియాలో కథనం నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు**

**10 నెలల్లో 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తమైనట్లు కథనం**

**ఎలాంటి అధికారిక భిన్నాభిప్రాయం లేదని ఈసీ స్పష్టీకరణ**



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై వివాదం కొనసాగుతున్న వేళ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘం అధికారులు చేస్తున్నది తప్పని వ్యాఖ్యానిస్తూ.. 'సమయం వస్తుంది.. మిమ్మల్ని వదలం' అంటూ హెచ్చరించారు. 'ఓటు చోరీ' భారత ప్రజల పట్ల నేరమని, రాజ్యాంగంపై నేరుగా దాడి చేయడమేనని ఎక్స్‌లో పోస్టు చేశారు.

ఓ వీడియోను కూడా రాహుల్ గాంధీ పంచుకున్నారు. "ఎన్నికల సంఘానికి, ఎన్నికల అధికారులకు స్పష్టంగా చెబుతున్నా.. మీరు చేస్తున్నది తప్పు. ఇది దేశద్రోహం. సమయం వస్తుంది. మిమ్మల్ని పట్టుకుంటాం. తప్పించుకోలేరు" అని అందులో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలకు కారణమైన వివాదం ఓ పత్రిక ప్రచురించిన పరిశోధనాత్మక కథనంతో మొదలైంది. పది నెలల వ్యవధిలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు నిర్ణయాలపై కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఆ కథనం పేర్కొంది. కొత్త ఓటర్ల చేర్పు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ వంటి అంశాలు అందులో ఉన్నట్లు తెలిపింది.

అయితే ఈ కథనాన్ని ఎన్నికల సంఘం తిరస్కరించింది. ఇద్దరు కమిషనర్లు కొన్ని అంశాలపై అభిప్రాయాలు, సూచనలు మాత్రమే చేశారని.. అధికారికంగా ఎలాంటి భిన్నాభిప్రాయం నమోదు కాలేదని ఈసీ వర్గాలు తెలిపాయి. 'సర్' సహా అన్ని నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల ఆమోదంతో ఏకగ్రీవంగానే తీసుకున్నట్లు స్పష్టం చేశాయి.

మరోవైపు కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం కూడా ఈ వ్యవహారంపై స్పందించారు. ఇటీవలి సంవత్సరాల్లో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలన్నింటినీ పార్లమెంటరీ కమిటీ సమీక్షించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న 'సర్' ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరారు.

## దసరాలోపు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేయాలి సీఎం రేవంత్ రెడ్డి



విద్యుత్ శాఖపై ఎంసీఆర్ హెచ్ఆర్డీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష

యాదాద్రి థర్మల్ కేంద్రంలో పూర్తి స్థాయి విద్యుత్ ఉత్పత్తి చేయకపోవడంపై అధికారులను ప్రశ్నించిన సీఎం, డిప్యూటీ సీఎం

యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి జీ 9 బొగ్గు అవసరమని తెలిపిన అధికారులు

సింగరేణి లో జీ 9 బొగ్గు ఉత్పత్తి చేసే బ్లాకులు లేవని, సమీప భవిష్యత్తులోనూ సింగరేణి నుంచి జీ 9 బొగ్గు ఉత్పత్తి అయ్యే అవకాశం లేదని తెలిపిన అధికారులు

జీ 9 బొగ్గు లభ్యత లేనప్పుడు ఆ సాంకేతికతతో ఎలా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మించారని ప్రశ్నించిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

పిట్ హెడ్ (బొగ్గు గనుల పైనే విద్యుత్ కేంద్ర నిర్మాణం) కాకుండా, దూరంగా ఎందుకు యాదాద్రి థర్మల్ కేంద్రం నిర్మించారని, దానికి బొగ్గు సరఫరాతో రాష్ట్రంపై పడే అదనపు భారం ఎంత అని అధికారులను ప్రశ్నించిన సీఎం, డిప్యూటీ సీఎం

నాడు రాజకీయ కారణాలతోనే పిట్ హెడ్ పై కాకుండా దూరంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మించారని తెలిపిన అధికారులు

యాదాద్రికి బొగ్గు సరఫరాతో తెలంగాణ రాష్ట్రంపై రూ. 40 వేల కోట్ల అదనపు భారం పడుతోందని తెలిపిన అధికారులు

సింగరేణి నుంచి జీ 9 బొగ్గు కు ఉన్న అవకాశాలపై ఆరా తీసిన సీఎం, డిప్యూటీ సీఎం

గత ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవడంతో జీ 9 బొగ్గును సింగరేణి సరఫరా చేయలేదని తేల్చిచెప్పిన అధికారులు

సింగరేణిలో ఇప్పటికే 14 బొగ్గు బ్లాకులు మూతపడ్డాయని తెలిపిన అధికారులు

రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న విద్యుత్ అవసరాల దృష్ట్యా మహానది కోల్ ఫీల్డ్స్, కోల్ ఇండియా నుంచి బొగ్గు కొనుగోలుకు చర్యలు ప్రారంభించాలని ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

తక్షణమే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో చర్చించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సూచించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

దసరాలోపు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేయాలని ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి

## సీఈసీకి తెలిసే రిగ్గింగ్ జరిగితే...!:

### ఎన్నికల కమిషన్‌పై ప్రియాంక గాంధీ తీవ్ర వ్యాఖ్యలు

**ఎన్నికల రిగ్గింగ్ గురించి తెలిసి సీఈసీ అనుమతిస్తే దేశద్రోహమని వ్యాఖ్య**

**ఈసీలో అవకతవకలపై వస్తున్న కథనాలు అత్యంత తీవ్రమైనవని వ్యాఖ్య**

**ఈ ఘటనపై సరైన దర్యాప్తు జరిపి బాధ్యులను శిక్షించాలని డిమాండ్**

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కేంద్ర ఎన్నికల కమిషన్‌తో పాటు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని తెలిసి కూడా సీఈసీ వాటిని అనుమతించి ఉంటే, అటువంటి చర్య దేశద్రోహం కిందకే వస్తుందని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం తన వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని నీలంబూరులో విలేకరులతో మాట్లాడిన సందర్భంగా ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు.





ఎన్నికల కమిషన్ (ఈసీ) పనితీరులో అక్రమాలు చోటుచేసుకున్నాయని, కమిషనర్ల మధ్య విభేదాలు ఉన్నాయని వెలువడిన మీడియా కథనాలపై ఆమె స్పందించారు. ఈ పరిణామాలు ప్రజాస్వామ్యానికి "అత్యంత ప్రమాదకరం" అని ఆమె అభివర్ణించారు. ఈ వ్యవహారంపై నిష్పక్షపాత విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సందర్భంగా పేర్ల తొలగింపు సహా పలు ఇతర అంశాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అసమ్మతి వ్యక్తం చేశారన్న కథనాలను ఈ సందర్భంగా ఆమె ప్రస్తావించారు. మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో లక్షలాది మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి అక్రమంగా తొలగించారని గత కొంతకాలంగా వస్తున్న ఆరోపణలను ఆమె గుర్తుచేశారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగకపోతే లేదా ఈసీయే అక్రమాలకు సహకరిస్తే, అది ప్రజాస్వామ్యంపై జరిగిన గొడ్డలిపెట్టుగా పరిగణించాల్సి ఉంటుందని అన్నారు. అయితే, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఎన్నికల కమిషన్ ఇదివరకే స్పష్టం చేయడం గమనార్హం.

## బీఆర్ఎస్ ది దోపిడీ పాలన.. కాంగ్రెస్ ది సంక్షేమ పాలన

**వైఎస్సార్ హయాంలో శంకుస్థాపన చేసిన వాటికి కూడా.. ప్రాజెక్టుల పేర్లు, రీ డిజైన్ల మార్పుతో రూ. వేలాది కోట్లు దండుకున్నారు**

**అహంకార వైఖరితోనే దళిత స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు**

**కుల మతాలకతీతంగా.. ప్రజా సంక్షేమ పాలనే మా లక్ష్యం**

**మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**పులుసుబొంత ప్రాజెక్టును కూడా పూర్తి చేస్తామని వెల్లడి**

**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 23:** గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాగునీటి ప్రాజెక్టులను రీ డిజైన్ ల పేర్లతో నిర్లక్ష్యం చేసి.. రూ.వేలాది కోట్ల తెలంగాణ ప్రజల సొమ్మును దోచుకున్నారని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



ధ్వజమెత్తారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వాపురం మండలం మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకాన్ని.. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రసంగించారు.

మండలంలోని 23 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తాం..

ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ద్వారా తుమ్మల చెరువు నుంచి 4,300 ఎకరాలకు సాగునీరు అందుతుందని, భవిష్యత్తులో అశ్వాపురం మండలంలోని అన్ని ప్రాంతాల పరిధిలో 23 వేల ఎకరాలకు సాగునీరు అందేలా కృషి చేస్తామని వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విజ్ఞప్తి మేరకు.. అనేక ఏళ్లుగా పెండింగ్లో ఉన్న పులుసు బొంత ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని, అవసరమైన భూసేకరణ, అటవీ క్లియరెన్స్ ను ఆచరణలోకి తెస్తామని అన్నారు.

వైఎస్సార్ హయాంలో శంకుస్థాపనలు చేస్తే.. గత పాలకుల స్వలాభం కోసం రీ డిజైన్లు

దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్సార్ హయాంలో.. ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తే.. బీఆర్ఎస్ పాలకులు రీ డిజైన్ల పేరుతో వేల కోట్లాది రూపాయలను దండుకునేందుకు.. సీతారామ ప్రాజెక్ట ను వారి స్వలాభాలకు ఎలా మార్చుకున్నారో అందరికీ తెలిసిన విషయమేనని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చాక మారేళ్లపాడు ప్రాజెక్టు పూర్తి చేశామని, భవిష్యత్తులో అనేక సాగునీటి ప్రాజెక్టులను రైతులకు అందుబాటులోకి తెస్తామని అన్నారు.

మాది చిత్తశుద్ధి ఉన్న ప్రభుత్వం..

పదేళ్లు రేషన్ కార్డు ఊసే ఎత్తకుండా పాలించారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు ఇచ్చామని అన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా ఇచ్చామని, రూ.72 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను మహిళలకు అందించామని తెలిపారు.కులమతాలకతీతంగా తమ పాలన సాగుతుండగా.. బీఆర్ఎస్ వారేమో అసెంబ్లీ



దళిత స్పీకర్ తల్లి పట్ల అహంకారపూరిత భాషతో మాట్లాడుతుండటం బాధాకరమని అన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను 3, 4 విడతల్లో కూడా అందజేస్తామని, సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా చూస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో: మహబూబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్, కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## రిమ్స్‌లో అగ్ని ప్రమాద ఘటనలో మృతి చెందిన పిల్లల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా

### మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఆదిలాబాద్ రిమ్స్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో మృతి చెందిన పిల్లల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను అందించనున్నట్టు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారు. ఆదిలాబాద్‌లోని వివిధ హాస్పిటళ్లలో చికిత్స పొందుతున్న పిల్లల ఆరోగ్య పరిస్థితిని మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే పిల్లలను హైదరాబాద్‌లోని పెద్ద హాస్పిటల్స్‌కు తరలించి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు.

రిమ్స్‌లో 150 బెడ్ల మాతా శిశు ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలు పెట్టబోతున్నామని మంత్రి వెల్లడించారు.

అత్యాధునిక వసతులతో ఎంసీహెచ్‌ను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.



# ప్రజాబలం

24 సెప్టెంబర్ 2026 గురువారం


## ఊగిసలాటలో చమురు ధరలు

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల వేళ ఇరాన్ కీలక ప్రతిపాదన చేసింది. అమెరికా సైనిక ఒత్తిడిని తగ్గించి, దిగ్బంధనాన్ని ఎత్తివేస్తే ఏడు రోజుల్లో హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు సిద్ధమని తెలిపింది. ఈ విషయాన్ని ఓ సీనియర్ ఇరాన్ అధికారి వెల్లడించినట్లు రాయిటర్స్ తెలిపింది. మధ్యవర్తుల ద్వారా ఈ ప్రతిపాదనను అమెరికాకు చేరవేసినట్లు సమాచారం.అమెరికాతో చర్చలను తిరిగి ప్రారంభించేందుకు ఇరాన్ సిద్ధంగా ఉన్నట్లు ఈ ప్రతిపాదనతో సంకేతాలు ఇచ్చింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సందర్భంగా న్యూయార్క్‌లో మధ్యవర్తి దేశాలతో ఈ అంశంపై చర్చించాలని టెహ్రాన్ భావిస్తోంది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య భేటీ ఉండబోదని ఇరాన్ అధికారి తెలిపారు. అయితే అమెరికా నిబద్ధత చూపితే ఒప్పందం దిశగా వెళ్లే అవకాశం ఉందన్నారు.హర్మూజ్ జలసంధికి సంబంధించిన సైనిక చర్యలను అమెరికా నిలిపివేయాలని ఇరాన్ కోరుతోంది. అమెరికా సైనిక ఒత్తిడిని తగ్గించి, ఇరాన్ పోర్టులపై ఆంక్షలు ఎత్తివేస్తే జలసంధిని తిరిగి తెరిచి చర్చలను కొనసాగిస్తామని టెహ్రాన్ చెబుతోంది. పోర్టులపై ఆంక్షలు ఇరాన్ ముడిచమురు ఎగుమతులు, సముద్ర రవాణాపై ప్రభావం చూపుతున్నాయి. చర్చలను పునరుద్ధరించేందుకు ఇరాన్ గతంలో ఏడు షరతులను కూడా వెల్లడించింది.హర్మూజ్ జలసంధి త్వరలో తెరుచుకునే అవకాశం ఉందన్న వార్తలతో అంతర్జాతీయ చమురు ధరలు తగ్గాయి. బ్యారెల్ చమురు ధర 99 డాలర్ల దిగువకు పడిపోయింది. బ్రెంట్ క్రూడ్ ధర సెషన్ గరిష్ఠ స్థాయి నుంచి 3.5 శాతానికి పైగా తగ్గగా, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ 2.25 శాతం పడిపోయింది. హర్మూజ్ ద్వారా ముడిచమురు సరఫరాలో అంతరాయాలపై ఆందోళనలు తగ్గడంతో ధరలు దిగివచ్చాయి. మురు సరఫరా వ్యవస్థలో తలెత్తిన కీలక పరిణామాలు మరియు మౌలిక వసతులు నరుద్ధరించబడటమే ఈ లభ్యతకు, ఫలితంగా ధరల తగ్గుదలకు ముఖ్య కారణాలుగా నిలుస్తున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఉత్పత్తి దారులలో ???న సౌదీ అరేబియా తమ 'ఈస్ట్ వెస్ట్ ఆయిల్ పైప్‌లైన్' ద్వారా సరఫరాలను తిరిగి ప్రారంభించడం మార్కెట్లో సానుకూల వాతావరణాన్ని నింపింది. దీనికితోడు గత కొంతకాలంగా అంతరాయం ఏర్పడిన ఎర్ర సముద్రపు సరుకు రవాణా మార్గాల ద్వారా చమురు ఎగుమతులు మళ్లీ పునరుద్ధరించబడటం అంతర్జాతీయంగా చమురు కొరత భయాలను తొలగించింది. సరఫరా మార్గాలు సజావుగా మారడంతో క్రూడాయిల్ లభ్యత పెరిగి, అంతర్జాతీయ బెంచ్ మార్క్ లైన బ్రెంట్ మరియు డబ్ల్యూటీఐ ధరలు గణనీయంగా దిగిరావడానికి మార్గం సుగమమైంది.వారం రోజుల క్రితం మధ్యప్రాచ్యంలో క్షీణిస్తున్న భద్రతా పరిస్థితులు ,సరికొత్త పరిణామాలతో అమెరికా ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఖతార్ మధ్యవర్తిత్వంతో అమెరికాతో యుద్ధాన్ని ముగించేందుకు తాము ఏడు ప్రధాన షరతులను ప్రతిపాదించినట్లు ఇరాన్ ప్రకటించింది. యుద్ధం పూర్తిగా నిలిచిపోవాలని, ఫ్రీజ్ చేసిన ఇరాన్ నిధులను విడుదల చేయాలని, అలాగే ఇరాన్ ఓడరేవులపై అమెరికా అమలు చేస్తున్న నావికా దిగ్బంధాన్ని ఎత్తివేయాలని టెహ్రాన్ డిమాండ్ చేస్తోంది. మరోవైపు, తాము సరికొత్త యాంటీ-షిప్ బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించామని, వాషింగ్టన్ కనుక పూర్తి స్థాయి యుద్ధానికే మొగ్గుచూపితే తాము సిద్ధమేనని ఇరాన్ హెచ్చరించింది.ఈ ఉద్రిక్తతల నీడలోనే యెమెన్‌లోని ఇరాన్ మద్దతుగల హూతీ రెబెల్స్ సౌదీ అరేబియాపై దాడులను తీవ్రతరం చేశారు. రాజధాని రియాద్‌లోని అత్యంత సున్నితమైన ప్రాంతాలతో పాటు యాన్బు లోని ప్రముఖ అరామ్‌కో చమురు నిల్వలపై బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు నిర్వహించినట్లు హూతీలు ప్రకటించారు. అయితే, ఈ దాడులను సౌదీ నేతృత్వంలోని కూటమి బలగాలు సమర్థవంతంగా తిప్పికొట్టాయని, ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా క్షిపణులను గాలిలోనే ధ్వంసం చేశామని సౌదీ స్పష్టం చేసింది. పౌరులు, పౌరసౌకర్యాలపై హూతీలు చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండించిన కూటమి, తగిన రీతిలో బదులిచ్చే హక్కు తమకు ఉందని హెచ్చరించింది.ఈ ప్రాంతంలో క్షీణిస్తున్న భద్రతా పరిస్థితుల కారణంగా, మధ్యప్రాచ్యంలోని తొమ్మిది దేశాలలో ఉన్న అమెరికన్ పౌరులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, గగనతల మూసివేతలు, విమానాల రాకపోకలు ఆగిపోయే పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని యూఎస్ విదేశాంగ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు, సౌదీ అరేబియాను ఈ ప్రాంతీయ యుద్ధంలోకి అనవసరంగా లాగకూడదని టర్కీ అంటోంది. ఇటీవలే కుదిరిన మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్ నిబంధనల ప్రకారం సౌదీకి అవసరమైన సైనిక సహాయాన్ని అందించడానికి సిద్ధంగా ఉన్నామని టర్కీ అంటోంది.మరో వైపు ట్రంప్ తన వారాంతాన్ని అత్యవసరంగా ముగించుకుని క్యాంపు డేవిడ్ కు చేరుకున్నారు. ఈ పరిణామాల మధ్యే దౌత్యపరమైన మంతనాలు కూడా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పాకిస్థాన్ మినిస్టర్ మొహ్సిన్ నఖ్వీ టెహ్రాన్ వెళ్లనున్నారు. అయితే అమెరికా ప్రతిపాదనలకు సంబంధించిన ఎలాంటి అధికారిక సమాచారాన్ని ఆయన మోసుకొని రావడం లేదని ఇరాన్ విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఏది ఏమైనప్పటికీ, హూతీల క్షిపణి దాడులు, ఇరాన్-అమెరికా మధ్య నడుస్తున్న మాటల యుద్ధం, గ్లోబల్ షిప్పింగ్ రూట్లపై పెరుగుతున్న నీడలు మిడిల్ ఈస్ట్‌ను మరోసారి అత్యంత ప్రమాదకర అంచున నిలబెట్టాయి.

## ఉద్యోగ, కార్మిక పక్షపాతి కాంగ్రెస్ పార్టీ :
## అల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ మధు యాష్కీ గౌడ్

**- గోషామహల్ లో తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభించిన మధుయాష్కీ గౌడ్**



**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక పక్షపాతి అని, వారి సమస్యలను ఒకొక్కటిగా పరిష్కరించుకుంటూ వస్తుందని అల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ తెలిపారు. హైదరాబాద్లోని గోషామహల్ లో బుధవారం జలమండలి గుర్తింపు కార్మిక సంఘం 'తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్' కార్యాలయాన్ని తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులూ చక్రధర్ రెడ్డి లతో కలసి మధుయాష్కీ గౌడ్ గారు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లోని ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఇందులో భాగంగానే కోటి మంది కార్మికులకు కనీస వేతనాలను అమలులోకి తీసుకవచ్చిందని చెప్పారు. ఇప్పటికే జలమండలి కార్మికుల సమస్యలను పరిష్కరించడంతోపాటు, ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిస్కారం అధికార కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, త్వరలో జరగనున్న ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ ను గెలిపించాలని మధుయాష్కీ గౌడ్ గారు కోరారు. మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ.. జలమండలి కార్మికులకు అండగా ఉన్నట్లే ఇతర కార్మికుల సమస్యలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందని తెలిపారు. జలమండలిలో ఇంకా పరిష్కరంకాని రెండు మూడు సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించిందని, వాటిని కూడా త్వరలో పరిష్కరిస్తుందని చెప్పారు. జలమండలి కార్మికులు అధికార పార్టీ గుర్తింపు సంఘాన్ని గెలిపించినట్లుగానే ఆర్టీసీ కార్మికులు సైతం కాంగ్రెస్ మద్దతు ఇస్తున్న తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ ను భారీ మెజారిటీ తో గెలిపించాలని మొగుళ్ళ రాజిరెడ్డి గారు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలోతెలంగాణ ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఈ. అశ్వథామ రెడ్డి, యూనియన్ ప్రధాన కార్యదర్శి టి. టి. రాఘవేంద్రరాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ లు అల్లి శ్రవణ్ కుమార్, ఎండి. జహంగీర్, నాయకులూ సయ్యిద్ అక్తర్ అలీ, ఆనంద్ రెడ్డి, అశోక్, చంద్రశేఖర్, ఏం. రాజా, నర్సింగ్ రావు, పి. చంద్రశేఖర్, ఏం. రాంచందర్, బి. మహేష్, అజైనాథ్, జైరాజ్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ ను కలిసి వినతిపత్రం అందించిన జగన్

**కూటమి ప్రభుత్వంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్న జగన్**
**విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్**
**శాప్ కార్యాలయం వద్ద దాడి చేసి,**
**బాధితులపైనే కేసులు పెట్టారని ఆరోపణ**
**నకిలీ సర్టిఫికెట్లు,**
**జీవోలతో నియామకాలు జరిపి తర్వాత రద్దు చేశారని వెల్లడి**
**న్యాయం జరిగే వరకు పోరాటం**



డీఎస్సీ అక్రమాలపై విజయవాడలోని క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) కార్యాలయం వద్ద తమ పార్టీ నేతలు నిరసన ప్రదర్శన చేపట్టారని, ఈ సందర్భంగా తమ నేతలపై దాడి జరిగిందని వైసీపీ అధినేత జగన్ నేడు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యారు. డీఎస్సీ స్కామ్‌కు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని, ఈ వ్యవహారంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని జగన్ డిమాండ్ చేశారు.

గవర్నర్‌తో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన జగన్, డీఎస్సీ కుంభకోణం ఎలా జరిగిందో ఆధారాలతో సహా గవర్నర్ కు వివరించినట్లు తెలిపారు. శాప్ కార్యాలయం వద్ద నిరసన తెలిపేందుకు అనుమతి తీసుకున్నప్పటికీ, అదే సమయంలో, అదే ప్రదేశంలో టీడీపీ గూండాలు ధర్నా నిర్వహించారని ఆరోపించారు. గతంలో 'సాక్షి' కార్యాలయాలపై దాడి చేసిన వారే ఈ దాడిలో పాల్గొని, నిరుద్యోగ యువత, వైసీపీ కార్యకర్తలపై దౌర్జన్యానికి పాల్పడ్డారని అన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బాధితులపైనే ప్రభుత్వం తీవ్రమైన సెక్షన్లతో కేసులు నమోదు చేయడం దారుణమని ఆయన విమర్శించారు.

ఈ రెండు ఘటనలతో పాటు డీఎస్సీ పరీక్షల నిర్వహణ నుంచి అభ్యర్థుల నియామకాల వరకు జరిగిన అక్రమాల తీరును గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు జగన్ వివరించారు. ఎస్‌సీఈఆర్‌టీకి నేతృత్వం వహిస్తున్న ఒకే వ్యక్తికి ప్రశ్నపత్రం రూపకల్పన, పరీక్షల నిర్వహణ బాధ్యతలు అప్పగించారని తెలిపారు. ఈ పరీక్షల్లో ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి మొదటి ర్యాంక్ వచ్చినా ఉద్యోగం ఇవ్వలేదని, ఇది ప్రశ్నపత్రం లీక్ అయిందనడానికి నిదర్శనమని వైసీపీ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.

తమకు కావాల్సిన వారికి ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రత్యేక జీవోలు జారీ చేసి, నియామకాలు పూర్తయ్యాక వాటిని రద్దు చేశారని, ఇది అక్రమాలకు బలమైన ఆధారమని జగన్ అన్నారు. కొందరు అభ్యర్థులు కనీసం టెట్ పరీక్ష కూడా రాయకుండానే ఉద్యోగాలు పొందారని, ఈ విధంగా 372 మందిని నిబంధనలకు విరుద్ధంగా నియమించారని ఆరోపించారు. టీడీపీ నేతల ఆధ్వర్యంలోని సాఫ్ట్‌బాల్, జూడో సంఘాలు జారీ చేసిన నకిలీ క్రీడా ధ్రువపత్రాలతో కొందరు ఉద్యోగాలు సంపాదించారని, ఈ విషయంలో శాప్, సంబంధిత సంఘాల మధ్య పరస్పర విరుద్ధ ప్రకటనలు వస్తున్నాయని తెలిపారు.

ఉద్యోగాల అమ్మకాలకు సంబంధించిన ఆడియో, వీడియో ఆధారాలు సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని జగన్ విమర్శించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు శాసనసభను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. అన్ని ఆధారాలు ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపుతున్నందున, మంత్రి లోకేశ్ రాజీనామా చేసి, సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో సుప్రీంకోర్టు చేసిన తీవ్ర వ్యాఖ్యలు ప్రభుత్వానికి చెంపపెట్టులాంటివని జగన్ గుర్తుచేశారు. ఈ అక్రమాలపై న్యాయం జరిగేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## శుక్రవారం హైదరాబాద్ లో వైన్ షాపులు, బార్లు బంద్

**ఈ నెల 25న హైదరాబాద్ లో గణేశ్ మహా నిమజ్జనం**
**జంట నగరాల పరిధిలో మద్యం విక్రయాలు బంద్**
**స్టార్ హోటళ్లు ఈ ఆంక్షల నుంచి మినహాయింపు**




గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వినాయక నిమజ్జనోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ నెల 25న (శుక్రవారం) జరగనున్న ప్రధాన గణేశ్ మహా నిమజ్జనం కోసం తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేయడంతో పాటు పలు ముఖ్యమైన ఆంక్షలను అమలు చేస్తున్నాయి.

మహా నిమజ్జనం, భారీ శోభాయాత్రల వల్ల నగరంలో ఏర్పడే రద్దీని దృష్టిలో ఉంచుకుని సెప్టెంబర్ 25న తెలంగాణ హైకోర్టుతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలు, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని సబార్డినేట్ కోర్టులన్నింటికీ సెలవు ప్రకటిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సెలవుకు బదులుగా డిసెంబర్ 5వ తేదీ శనివారాన్ని వర్కింగ్ డేగా ప్రకటించారు.

మరొకవైపు ప్రశాంత వాతావరణంలో వేడుకలు పూర్తి కావడానికి వీలుగా మద్యం విక్రయాలపై ఆంక్షలు విధించారు. హైదరాబాద్ లో సెప్టెంబర్ 25న ఉదయం 6 గంటల నుంచి సెప్టెంబర్ 26 ఉదయం 6 గంటల వరకు 24 గంటల పాటు వైన్ షాపులు, కల్లు కాంపౌండ్లు, రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. అయితే స్టార్ హోటళ్లు, రిజిస్టర్డ్ క్లబ్బులలోని బార్లకు మాత్రం ఈ ఆంక్షల నుంచి మినహాయింపునిచ్చారు.

# శ్రీరామనవమి నాటికి.. నిర్మాణ పనులన్నీ పూర్తి కావాలి..

## రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**భద్రాచల దేవస్థానంలో**

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు..**

**ప్రాకారాలనిర్మాణాల పరిశీలనసబ్ కలెక్టర్..**

**కార్యాలయంలో ఉన్నతా ధికారులతో సమీక్ష..**

**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 23:**వచ్చే ఏడాది శ్రీరామనవమి నాటికి భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థాన ప్రాకారాలు, మాడ వీధుల పున:నిర్మాణ పనులు పూర్తి కావాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంబంధిత కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం మహబాద్ ఎంపీ బలరాం నాయక్,





భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న లతో కలిసి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు.. వేద ఆశీర్వచనాలతో తీర్థప్రసాదాలు అందజేశారు.

వర్షం కురుస్తున్నా పనుల పరిశీలన..

బుధవారం ఉదయం నుంచి భద్రాచలం పరిసర ప్రాంతాల్లో వర్షం కురుస్తున్నప్పటికీ.. ముందస్తు షెడ్యూల్ ప్రకారం మంత్రి పొంగులేటి దేవాలయం చేరుకున్నారు. దమ్మక్క అన్నదాన సత్రం నుంచి.. మెట్లదారి వరకు వర్షపు చినుకులు కురుస్తున్నా.. బురదలోనే దేవస్థానం చుట్టూ కలియతిరిగి నేరుగా పనులను పరిశలించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం నెలకొనొద్దని సూచనలు చేశారు. ఆ తర్వాత భద్రాచలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు.

వంద శాతం పనులు పూర్తి చేయిస్తాం..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో..రూ.300 కోట్ల నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈనెల 4వ తేదీన పరిశీలించానని, మళ్లీ ఇప్పటివరకు జరిగిన పురోగతిని నేరుగా తెలుసుకునేందుకు వచ్చినట్లు వెల్లడించారు. అధికారులు కూడా నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ఆగమ శాస్త్ర నిబంధనల ప్రకారం పునఃనిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. భక్తులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందేలా.. సకాలంలో పూర్తి చేస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం..

**అర్హులందరికీ.. పక్కా ఇళ్లు అందించాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం ..**

**రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి**

**భద్రాచలంలోని అంబ సత్రం మార్గంలో నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి..**

**లబ్ధిదారుకు బట్టలు పెట్టిన శీనన్న**

**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 23:**పేద, మధ్యతరగతి కుటుంబాల్లో సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అర్హులైన పేదలందరికీ మూడో విడతలో, అవసరమైతే నాలుగో విడతలోనూ ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామని తెలిపారు.





భద్రాచలంలోని అంబ సత్రం సమీపంలోని కాలనీలో లబ్ధిదారు మామిడి మౌనిక నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఉదయం ప్రారంభించారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్‌లతో కలిసి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారు కుటుంబ సభ్యులకు మంత్రి నూతన వస్త్రాలు అందజేశారు.

అనంతరం మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి అక్కాచెల్లెళ్ల కుటుంబాల్లో సొంతింటి కలను నిజం చేసి, వారి జీవితాల్లో ఆనందం నింపాలన్న సదుద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో: ఎస్పీ రోహిత్‌రాజ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు దేవీప్రసన్న, పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు..

# కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి

**రెడ్ అలర్ట్ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిది** హైదరాబాద్, , సెప్టెంబర్ 23: అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రెడ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.

పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వాగులు, చెరువులు, వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

ప్రతి జిల్లాలో 24 గంటలూ అందుబాటులో ఉండే కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి ప్రజలకు తక్షణ సహాయం అందించాలని కలెక్టర్లను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాగులు, చెరువులు, వరద ప్రవాహ ప్రాంతాల వైపు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు.

# డిజిటల్ గవర్నెన్స్'లో రోల్ మోడల్ గా తెలంగాణ

**ఇంటి ముంగిటకే 'మీ సేవా' సేవలు**

**తొలి దశలో 'క్యూర్' ప్రాంతాల్లో అమలు**

**'మీ సేవా డోర్ డెలివరీ సర్వీసెస్' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు**



'గుడ్ గవర్నెన్స్'కు టెక్నాలజీని జోడించి 'డిజిటల్ గవర్నెన్స్'లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్ గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పౌర సేవల్ని నేరుగా ఇంటి ముంగిటకే చేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. బుధవారం బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో 'మీ సేవా డోర్ డెలివరీ సర్వీసెస్'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పాలనలోనూ అనేక విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. అడ్మినిస్ట్రేషన్ కు టెక్నాలజీని జోడించి పారదర్శకత, జవాబుదారీతనం, సుపరిపాలనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రభుత్వం, యంత్రాంగమే నేరుగా ప్రజల దగ్గరికే వెళ్లేలా ఈ 'డోర్ డెలివరీ సర్వీసెస్'కు శ్రీకారం చుట్టామన్నారు. 1100 టోల్ ఫ్రీ నంబర్ లేదా మీ సేవ పోర్టల్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుంటే... జనన/మరణ ధృవీకరణ పత్రాలు, ఆదాయ, కుల, నివాస సర్టిఫికేట్లు, ఈసీ కాపీలు, పోలీసు శాఖ సేవలు, ఐజీఆర్ఎస్ రిజిస్ట్రేషన్లు తదితర మీ సేవా సేవలను ఇంటి దగ్గరే అందిస్తామన్నారు. ఇందుకోసం 70 మందికి పైగా మీ సేవ ఏజెంట్లు, మీ సేవ వీఎల్ఈలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. తొలిదశలో 'క్యూర్' ప్రాంతాల్లో ఈ సేవలను ప్రారంభిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకూ విస్తరిస్తామన్నారు. పౌరులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని... ఇంటి నుంచే పౌర సేవల్ని పొందాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐటీఈఅండ్ సీ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, మీ సేవా కమిషనర్ రవి కిరణ్, టీజీటీఎస్ ఎండీ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి.

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు**

**ఎమ్మెల్యే మట్టా రాగమయి విజ్ఞప్తి..**

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 23:** సత్తుపల్లి నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులు మంజూరు చేయడంతో పాటు విద్యార్థుల భద్రత కోసం సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ కోరారు. బుధవారం హైదరాబాద్ సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న పరిస్థితులు, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలపై మంత్రికి వివరించారు.



హాస్టళ్లలో భవనాల అభివృద్ధి, ఇతర మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యంగా హాస్టళ్ల చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే విద్యార్థులకు మరింత సురక్షితమైన వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదిత అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి, అవసరమైన ప్రభుత్వ సహకారం అందించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఎమ్మెల్యే రాగమయి దయానంద్ కోరారు.

## బెంగాల్‌లో మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించండి.. సీఈసీపై విమర్శల నేపథ్యంలో మమత డిమాండ్



పశ్చిమ బెంగాల్‌లో మరోసారి రాజకీయ వేడి రాజుకుంది. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) వివాదం మరోసారి ముదురుతోంది. 'సర్' సహా ఓటర్ల తొలగింపు, చేర్పు వంటి కీలక నిర్ణయాలపై ఎన్నికల సంఘం కమిషనర్ల అభ్యంతరం వ్యక్తం చేశారన్న వార్తలు దీనికి ఆజ్యం పోశాయి. ఈ నేపథ్యంలో మాజీ సీఎం మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. పాత ఓటర్ల జాబితాతో బెంగాల్‌లో మరోసారి అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను అరెస్ట్ చేయాలని కోరారు.

జ్ఞానేశ్ కుమార్ సీఈసీగా ఉన్నంతకాలం దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని ప్రకటించారు. ఈ అంశంపై ఇండియా కూటమి భాగస్వామ్యాలతో చర్చించామన్నారు. త్వరలో సమావేశం అవుతామని తెలిపారు.

టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీకి ప్రయోజనం చేకూర్చేందుకు బెంగాల్ ఓటర్ల జాబితా నుంచి 30 లక్షల పేర్లను ఉద్దేశపూర్వకంగా తొలగించారని ఆరోపించారు. హర్యానా, బీహార్‌లోనూ ఇలాంటి చర్యలు జరిగాయని అన్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి,

**పాత ఓటర్ల జాబితాతో బెంగాల్‌లో మళ్లీ ఎన్నికలు జరపాలని మమత డిమాండ్**

**సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్టు చేయాలని మమత వ్యాఖ్య**

**దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని మమత ప్రకటన**

**30 లక్షల ఓటర్ల పేర్లు తొలగించారని అభిషేక్ ఆరోపణ**

**ఇద్దరు ఈసీలు 'సర్'పై అభ్యంతరాలు తెలిపినట్లు వార్తల నేపథ్యంలో వ్యాఖ్యలు**

ఎన్నికల సంఘం వ్యవహారాలపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు.

అయితే ఎన్నికల సంఘం ఈ ఆరోపణలను ఖండించింది. 'సర్' సహా అన్ని కీలక నిర్ణయాలు ముగ్గురు ఎన్నికల కమిషనర్ల ఏకగ్రీవ ఆమోదంతోనే తీసుకున్నామని స్పష్టం చేసింది. అధికారులు చర్చల సమయంలో వివిధ అభిప్రాయాలు, సూచనలు ఇవ్వడం సాధారణ పరిపాలనా ప్రక్రియలో భాగమేనని తెలిపింది. ఓటర్ల హక్కులను కాపాడేందుకే ఈ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొంది.

# గణేశ్ నిమజ్జనానికి హైదరాబాద్ సిటీ పోలీస్ సర్వసన్నద్ధం..



శోభాయాత్రకు 10 వేల సీసీ కెమెరాలు, 24 డ్రోన్లతో నిఘా..బందోబస్తుకు 20 వేల మంది పోలీస్ సిబ్బంది విధులు.హైదరాబాద్ లో వైభవంగా ప్రారంభమైన వినాయక ఉత్సవాల ముగింపు వేడుకలకు, ఈ నెల 25న శుక్రవారం జరిగే మహానిమజ్జన శోభాయాత్రకు హైదరాబాద్ సిటీ పోలీసు యంత్రాంగం సర్వసన్నద్ధమైంది. మూడో రోజు నుంచే ప్రారంభమైన విగ్రహాల నిమజ్జనం ఇప్పటికే నగరంలో ప్రశాంతంగా సాగుతుండగా, చివరి రోజు బాలాపూర్ గణేష్ నుంచి జరిగే తుది శోభాయాత్రను అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ విజయవంతం చేసేందుకు హైదరాబాద్ సిటీ పోలీస్ విస్తృత ఏర్పాట్లు చేసింది.

హైదరాబాద్‌తో పాటు సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ, పొరుగు జిల్లాల నుంచి పోటెత్తే లక్షలాది మంది భక్తులు, వేలాది విగ్రహాల రాకను దృష్టిలో ఉంచుకుని బందోబస్తు వ్యూహాన్ని అమలు చేస్తోంది. తెలంగాణ ప్రభుత్వంతో పాటు జీహెచ్ఎంసీ, విద్యుత్, వాటర్ బోర్డు, తదితర అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో తగిన చర్యలు తీసుకుంటోంది. హైదరాబాద్ నలుమూలలా భద్రతా వలయాన్ని పటిష్టంగా తీర్చిదిద్ది, ఎలాంటి చిన్నపాటి అవాంఛనీయ ఘటనలకూ తావులేకుండా ప్రశాంత వాతావరణంలో లంబోదరుడికి వీడ్కోలు పలికేలా కార్యాచరణ సిద్ధం చేసింది. ఇప్పటివరకు ఖైరతాబాద్ బడా గణేష్ ను 25 లక్షలు, బాలాపూర్ వినాయకుడిని 15 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు. నిమజ్జన చివరి రోజున ఈ రెండు ప్రాంతాల్లో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉండటంతో.. అక్కడ భద్రతా పరంగా అన్ని చర్యలు తీసుకుంటోంది.

సమగ్ర ముందస్తు కసరత్తు.. శాఖల సమన్వయం

ఉత్సవాల నిర్వహణ కోసం మూడు నెలల ముందు నుంచే పకడ్బందీ కసరత్తును హైదరాబాద్ సిటీ పోలీస్ ప్రారంభించింది. ధూల్‌పేట్, లక్ష్మీదేవిగూడ విగ్రహ తయారీదారులతో మొదలుపెట్టి జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, విద్యుత్, జలమండలి, రవాణా, అగ్నిమాపక, వైద్యారోగ్య, హైడ్రా, సమాచార పౌరసంబంధాలు, హెచ్ఎండీఏ తదితర ప్రభుత్వ విభాగాలతో పాటు భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులతోనూ హైదరాబాద్ సీపీ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గారు పలు దఫాలుగా సమన్వయ సమావేశాలను నిర్వహించారు. ఖైరతాబాద్, బాలాపూర్ ఉత్సవ కమిటీలు, పీస్ కమిటీల ప్రతినిధులతో భేటీలు జరిపారు.

ఉత్సవాల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత స్థాయిలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచింది. గణేశ్ ఉత్సవాలను అత్యంత వైభవంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలన్న లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారు ఈ నెల 12న ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. దీనికి కొనసాగింపుగా, ఈ నెల 13న డాక్టర్ ఎంసీఆర్ హెచ్ఆర్డీలో గౌరవ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారు అన్ని ప్రభుత్వ విభాగాలతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించి, క్షేత్రస్థాయి సిబ్బందికి కచ్చితమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పోలీసు శాఖలోని అన్ని విభాగాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్షేత్రస్థాయి విధులను నిర్దేశించడంతో పాటు.. వివిధ శాఖలు, ఉత్సవ నిర్వాహకులతో క్షణక్షణం సమన్వయం చేసుకునేందుకు ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను అందుబాటులోకి తెచ్చాం.

నగరవ్యాప్తంగా పారదర్శకత కోసం ప్రవేశపెట్టిన మండపాల ఆన్‌లైన్ విధానం ద్వారా 15,426 దరఖాస్తులు రాగా, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం 14,929 మండపాలకు అనుమతులను మంజూరు చేశారు. అనుమతి పొందిన అన్ని మండపాలను 'జియో ట్యాగింగ్' చేయడంతో పాటు ప్రమాద నివారణ, విద్యుత్ తీగల రక్షణ జాగ్రత్తలపై తెలుగు, ఆంగ్ల భాషల్లో ముద్రించిన పోస్టర్లను మండపాల వద్ద అతికించారు. ఇప్పటివరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 32,878 విగ్రహాల నిమజ్జనం విజయవంతంగా ముగియగా, అందులో హైదరాబాద్ నగరానికి చెందిన 6,108 విగ్రహాలు ఉన్నాయి. గత 24 గంటల్లోనే నగర పరిధిలోని 2,161 విగ్రహాలు గంగమ్మ ఒడికి చేరాయి. శోభాయాత్ర సాఫీగా సాగేందుకు బాలాపూర్ నుంచి హుస్సేన్‌సాగర్ వరకు ఉత్సవ సమితులు, వివిధ శాఖల అధికారులతో కలిసి సంయుక్త రూట్ తనిఖీలు పూర్తిచేసి రోడ్ల మరమ్మతులు, విద్యుత్ తీగల తొలగింపు, చెట్ల కొమ్మల కత్తిరింపులు వంటి పనులను పూర్తి చేశారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షణ

శోభాయాత్రను క్షణక్షణం పర్యవేక్షించేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని హైదరాబాద్ సిటీ పోలీస్ పూర్తిస్థాయిలో రంగంలోకి దించింది. ఊరేగింపు సాగే ప్రధాన మార్గాల్లో 10 వేల సీసీ కెమెరాలను బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీలోని కంట్రోల్ రూంకు అనుసంధానించింది. కీలక రహదారులపై డేగకన్ను వేసేందుకు 24 అత్యాధునిక డ్రోన్లను ఉపయోగిస్తోంది. ప్రధాన మార్గాల్లో దాదాపు 100 వరకు హైరైజ్ కెమెరాలను వినియోగిస్తున్నారు. వీటి ద్వారా విగ్రహాల లెక్కింపును చేస్తున్నారు.

శోభాయాత్ర మార్గాల్లోని ఎత్తైన భవనాల పైకప్పులపై అత్యాధునిక బైనాక్యులర్లు, వైర్‌లెస్ సెట్లతో సిబ్బందిని మోహరించి ప్రధాన కంట్రోల్ రూమ్‌కు పోలీస్ అధికారులు అనుసంధానం చేశారు. బంజారాహిల్స్‌లోని ప్రధాన జాయింట్ కంట్రోల్ రూమ్‌తో పాటు ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, నెక్లెస్ రోడ్, మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటైన ప్రత్యేక కంట్రోల్ రూముల్లో అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు 24 గంటలూ అందుబాటులో ఉంటూ సహాయక చర్యలు పర్యవేక్షిస్తారు. ప్రధాన జలాశయాల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఆర్మీ, పర్యాటక శాఖలకు చెందిన నిపుణులైన గజ ఈతగాళ్లను, రెస్క్యూ బోట్లను సిద్ధంగా ఉంచారు. విద్యుత్ అంతరాయాలు కలగకుండా మొబైల్, స్టాటిక్ జనరేటర్లు, రాత్రి వేళల్లో నిఘా కోసం వాచ్ టవర్లు, వైద్య సేవల కోసం పారామెడికల్ సిబ్బందితో కూడిన అంబులెన్సులు, అగ్నిమాపక శకటాలను సిద్ధం చేశారు. వాహనాలు మొరాయిస్తే ట్రాఫిక్ నిలిచిపోకుండా ఉండేందుకు ప్రధాన కూడళ్ల వద్ద మెకానిక్‌లు, అదనపు డ్రైవర్లను సైతం అందుబాటులో ఉంచారు.

20 వేల మందితో పహారా.. కేంద్ర బలగాల మోహరింపు

శాంతిభద్రతల పరిరక్షణ కోసం హైదరాబాద్ కమిషనరేట్‌కు చెందిన లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, సిటీ సెక్యూరిటీ వింగ్, సీఏఆర్ తదితర విభాగాల నుంచి దాదాపు 20 వేల మంది సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటారు. ఇతర జిల్లాల నుంచి గతంలో నిమజ్జన బందోబస్తులో అనుభవమున్న 8,142 మంది అధికారులు, సిబ్బందితో కూడిన 42 ప్లాటూన్లను రప్పించి ఏడు జోన్లకు కేటాయించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో శాంతిభద్రతల కోసం 4 రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) కంపెనీలను చార్మినార్, గోల్కొండ, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్లలో, 2 సీఆర్‌పీఎఫ్ కంపెనీలను ఖైరతాబాద్, సికింద్రాబాద్‌లలో మోహరించారు. 53 వరకు బీడీ టీంలు ఈ బందోబస్తులో విధుల్లో ఉంటున్నాయి. నగర ప్రవేశ మార్గాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మాల్స్ వంటి జనసమ్మర్ధ ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. శోభాయాత్రలో ప్రధాన ప్రాంతాలైన మొజంజాహి మార్కెట్, బషీర్ బాగ్, తదితర ప్రాంతాల్లో ఐజీ/డీఐజీ ర్యాంకు అధికారులను నియమించింది.

ప్రజారోగ్యం, శబ్ద కాలుష్య నియంత్రణపై సుప్రీంకోర్టు వెలువరించిన మార్గదర్శకాలకు అనుగుణంగా నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలు, సౌండ్ మిక్సర్లు, అధిక శబ్ద తీవ్రత కలిగించే పరికరాలు, బాణసంచా కాల్చడంపై హైదరాబాద్ సిటీ పోలీస్ పూర్తిగా నిషేధం విధించింది. ఈ అంశంపై ఇప్పటికే జారీ చేసిన ఉత్తర్వులను అతిక్రమిస్తే పరికరాలను సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తోంది.

మరోవైపు మహిళలు, యువతుల భద్రతకు పెద్దపీట వేస్తూ మూడు షిఫ్టుల్లో 26 షీ-టీమ్స్ బృందాలు విధుల్లో ఉంటాయి. ఉత్సవాలు ప్రారంభమైన సెప్టెంబరు 14 నుంచి ఇప్పటివరకు ఖైరతాబాద్, బాలాపూర్ వంటి రద్దీ ప్రదేశాల్లో అసభ్యంగా ప్రవర్తించిన 1,172 మంది ఆకతాయిలను (1,121 మంది మేజర్లు, 51 మంది మైనర్లు) పట్టుకున్నారు. నిమజ్జనం రోజున నేర నియంత్రణ కోసం సీసీఎస్ పరిధిలో 139 మంది సిబ్బందిని 5 సెక్టార్లుగా విభజించి, 25 ప్రత్యేక బృందాలుగా మఫ్టీలో నిఘా ఉంచనున్నారు. ఆపదలో ఉన్న మహిళలు తక్షణమే డయల్ 112 లేదా షీ-టీమ్స్ వాట్సాప్ నంబర్ 9490616555 కు సమాచారం ఇవ్వాలని హైదరాబాద్ సిటీ పోలీస్ కోరుతోంది.

హైదరాబాద్ సీపీ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గారు మాట్లాడుతూ.. "గణేశ్ నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా, సురక్షితంగా ముగించేందుకు హైదరాబాద్ సిటీ పోలీసు యంత్రాంగం తరఫున అన్ని రకాల పకడ్బందీ చర్యలు తీసుకున్నాం. నగర ప్రజలంతా సంయమనం పాటిస్తూ పండుగను ఆనందోత్సాహాలతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి. అయితే, పవిత్రమైన ఉత్సవం పేరుతో కొందరు మితిమీరి అసభ్యకరంగా ప్రవర్తించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఇది ఏమాత్రం మంచి పద్ధతి కాదు, సభ్యసమాజం హర్షించదగ్గ విషయం అంతకన్నా కాదు. ఇలాంటి విషయాల్లో పోలీసు యంత్రాంగం అత్యంత సీరియస్‌గా ఉంటుంది. సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా, పుకార్లు సృష్టించినా ఉపేక్షించబోం. గౌరవ హైకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారమే కేటాయించిన జలాశయాల్లో నిమజ్జనాలు చేపట్టాలి. హైదరాబాద్ విశిష్ట సంస్కృతి అయిన 'గంగా-జమునా తెహజీబ్'ను, సోదరభావాన్ని కాపాడుకుంటూ పోలీసులకు సంపూర్ణంగా సహకరించి ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నాం." అని అన్నారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా సిటీ ట్రాఫిక్ పోలీసులు జారీ చేసే అడ్వైజరీలను ఎప్పటికప్పుడు నగర ప్రజలు ఫాలో కావాలని, అందుకు అనుగుణంగా తమ ప్రయాణాలను చేసుకోవాలని ఆయన సూచించారు.

వాహనాల డ్రైవర్ల విషయంలో నిర్వాహకులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, అనుభవజ్ఞులైన వారిని నియమించుకోవాలని చెప్పారు. మండపం నుంచి నిమజ్జనం వరకు ముందుగానే రూట్ సర్వే చేయాలని, ఇబ్బందులు ఎక్కడున్నాయో ముందే గుర్తుంచుకుని, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రసాదాల వితరణ విషయంలో కొందరు అలసత్వంగా వ్యవహరిస్తున్నారని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిభావంతో పాటు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయి

## పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎం.అంజనకుమార్ యాదవ్



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి

హైద్రాబాద్ సెప్టెంబర్ 23: గోశామహల్ నియోజకవర్గం లోని ఉస్మాన్ గంజ్, కొత్త ఉస్మాన్‌గంజ్‌లలో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాలను పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ,మజీ ఎంపీ ఎం.అంజనకుమార్ యాదవ్ సందర్శించి ప్రత్యేక పూజలు జరిపారు.

ఈ సందర్భంగా అంజనకుమార్ యాదవ్ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిభావంతో పాటు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో,ఆకాష్ సింగ్,వికాశాల్ చిందాలియా,శ్రీనివాసరెడ్డి,ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఎస్. ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల పోరాటంతోనే ప్రభుత్వం దిగొచ్చింది: జూరాల నీటి విడుదలపై కేటీఆర్

**జూరాల కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేసిన ప్రభుత్వం**
**పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్లు తప్ప అన్న కేటీఆర్**
**రైతుల ఉద్యమ ఒత్తిడి వల్లే ప్రభుత్వం దిగొచ్చిందని వ్యాఖ్య**

జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు అధికారులు నీటిని విడుదల చేసిన పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. "పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప" అనే ప్రసిద్ధ నినాదాన్ని గుర్తుచేస్తూ... తమ హక్కుల సాధన కోసం రోడ్డెక్కిన పాలమూరు అన్నదాతల పోరాట పటిమ గొప్పదని కొనియాడుతూ సోషల్ మీడియా వేదికగా ట్వీట్ చేశారు. కాలువలకు నీరు అందక పంట పొలాలు ఎండిపోతున్న విపత్కర పరిస్థితుల్లో రైతులు చేసిన సమరశీల పోరాటం అత్యంత స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు.



రైతాంగ సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఈ ప్రభుత్వాన్ని రైతులు ముల్లుగర్రతో తట్టి నిద్రలేపి, నీటిని విడుదల చేసేలా పరుగులు పెట్టించారని కేటీఆర్ ప్రశంసించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ నిర్బంధాలను సైతం ఎదుర్కొని రైతులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నించడం, తెలంగాణ ప్రజల కనీస అవసరాలను తీర్చేలా ఈ ప్రభుత్వాన్ని పరుగులు పెట్టించడమే రాబోయే కాలంలో బీఆర్ఎస్ ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు. రైతుల ఉద్యమ ఒత్తిడి వల్లే ప్రభుత్వం ఎట్టకేలకు దిగొచ్చి నీటిని విడుదల చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

# ల్యాండ్ పూలింగ్ అడుగులు

గుంటూరు, సెప్టెంబర్ 23, ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతి నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. రాజధాని విస్తరణ, మౌలిక వసతుల కల్పన కోసం నిర్వహిస్తున్న రెండో విడత భూసమీకరణ ప్రక్రియకు భూములిచ్చేందుకు రాజధాని ప్రాంత రైతులు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా వైకుంఠపురం గ్రామ పరిధిలోని మాదల కుటుంబం తమకు చెందిన 14.365 ఎకరాల భూమిని అమరావతి నిర్మాణం కోసం సీఆర్డీఏ కు అందజేసేందుకు అంగీకరించింది. రాజధాని నిర్మణంలో భాగస్వామ్యం కావడం పట్ల ఆ రైతు కుటుంబ సభ్యులు తీవ్ర ఆనందం వ్యక్తం చేశారు.రాయపూడిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మాదల శ్రీనివాసరావు కుటుంబసభ్యులు సీఆర్డీఏ అదనపు కమిషనర్ కొల్లాబత్తుల కార్తీక్‌కు అధికారిక అంగీకార పత్రాలను అందజేశారు. ఈ సమీకరణలో భాగంగా మాదల శ్రీనివాసరావు నుంచి 4.395 ఎకరాలు, మాదల అప్పారావు నుంచి 4.985 ఎకరాలు, అలాగే మాదల రాంబాబు నుంచి 4.985 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ బి. కన్యాకుమారి, ఇతర అధికారులు పాల్గొని రైతులకు ధన్యవాదాలు తెలిపారు.నవ్యాంధ్ర రాజధాని నగరం ప్రపంచస్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న తరుణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ల్యాండ్ పూలింగ్‌కు భూములిచ్చిన మాదల కుటుంబ సభ్యులు కోరారు. రెండో విడత భూసమీకరణకు అమరావతి పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు, రైతులు పూర్తిస్థాయిలో సహకరించి రాజధాని అభివృద్ధికి తోడ్పడాలని వారు విజ్ఞప్తి చేశారు.

# దసరా, దీవాళికి స్పెషల్ ట్రైన్స్...

నెల్లూరు, సెప్టెంబర్ 23, పండగలు వచ్చేస్తున్నాయ్.. వచ్చే నెలలో దసరా, దీపావళి రానున్నాయి. ఈ రెండు పండగల నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నారా? అయితే, మీకో గుడ్ న్యూస్.. పండగ ప్రయాణికులకు భారత రైల్వే శుభవార్త చెప్పింది.పండగల సమయంలో రైళ్లపై పెరగనున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా 100 ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ స్పెషల్ ట్రైన్లు నవంబర్ వరకు వివిధ మార్గాల్లో నడవనున్నాయి. ఇప్పటికే కొన్ని రైళ్లకు బుకింగ్స్ ప్రారంభమయ్యాయి.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, అస్సాం, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలను కలుపుతూ ఈ ప్రత్యేక సర్వీసులను నడపనున్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల మీదుగా వెళ్లే పలు రైళ్లు ప్రయాణికులకు ఉపయోగపడనున్నాయి.చర్లపల్లి?నాగర్‌కోయిల్ (07535) ప్రత్యేక రైలు సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 23 వరకు ప్రతి శుక్రవారం నడుస్తుంది. నల్లగొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, చెన్నై ఎగ్మోర్, తిరుచిరాపల్లి తదితర స్టేషన్లలో ఆగుతుంది.

అలాగే, చర్లపల్లి?శ్రీకాకుళం (07037) రైలు అక్టోబర్ 6 నుంచి నవంబర్ 24 వరకు, తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం?చర్లపల్లి (07038) రైలు అక్టోబర్ 7 నుంచి నవంబర్ 25 వరకు సర్వీసులు అందించనున్నాయి. ఈ రైళ్లు నల్లగొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, విజయనగరం తదితర స్టేషన్లలో ఆగుతాయి.మరోవైపు.. ప్రయాగ్‌రాజ్?తిరునెల్వేలి (04171) ప్రత్యేక రైలు కూడా తెలుగు రాష్ట్రాల మీదుగా నడుస్తుంది. ఈ సర్వీసు రామగుండం, వరంగల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు తదితర ప్రాంతాలను కలుపుతుంది

## అల్వాల్లో తొలిసారిగా ఆయిల్పామ్ అవగాహన సదస్సు.

## తొలి పంట కోతను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కేశంపేట మండలం అల్వాల్ గ్రామంలో తొలిసారిగా ఆయిల్పామ్ సాగుపై అవగాహన సదస్సుతో పాటు పంట కోత మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతు భుజంగారెడ్డి సాగు చేసిన ఆయిల్పామ్ తోటలో తొలి పంట కోతను షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు,ఉద్యానవన అధికారులు, ఉద్యానవన విస్తరణ అధికారులు, వాల్యూ ఆయిల్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.జిల్లాలో 4,370 ఎకరాల్లో ఆయిల్పామ్ సాగు

రంగారెడ్డి జిల్లా ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ కే.సురేష్ మాట్లాడుతూ... మూడు సంవత్సరాల క్రితం నాటిన ఆయిల్పామ్ తోటలో తొలి పంట కోత ప్రారంభించేందుకు వచ్చామని తెలిపారు.రంగారెడ్డి జిల్లాలో తొలిసారిగా కోతకు వచ్చిన ఆయిల్పామ్ తోట భుజంగారెడ్డిదేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులకు ఆయిల్పామ్ సాగుపై అవగాహన కల్పించేందుకు సదస్సు నిర్వహించినట్లు తెలిపారు.జిల్లాలో మొత్తం 3.57 లక్షల ఎకరాల సాగుయోగ్యమైన భూమి ఉందని,కాల్వలు, రిజర్వాయర్లు అందుబాటులో లేకపోవడంతో 57,637 బోర్లు, 5,600 బావుల ఆధారంగా సాగు జరుగుతోందని వివరించారు.

జిల్లాలో మొదటి ఏడాది 510 ఎకరాలు, రెండో ఏడాది 1,637 ఎకరాలు, మూడో ఏడాది 1,601 ఎకరాల్లో ఆయిల్పామ్ సాగు ప్రారంభమైందని, ప్రస్తుతం మొత్తం 4,370 ఎకరాల్లో ఈ పంట సాగులో ఉందన్నారు. ఈ ఏడాది 2,300 ఎకరాల్లో ఆయిల్పామ్ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 829 మంది రైతులు 2,672 ఎకరాలకు నాన్-సబ్సిడీ చెల్లించి దరఖాస్తు చేసుకున్నారని సురేష్ తెలిపారు.ఆయిల్పామ్ 30 నుంచి 40 సంవత్సరాల పాటు సాగు చేయగల సుదీర్ఘకాలిక పంట అని, నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమవుతుందని చెప్పారు. ఎకరానికి నాలుగో సంవత్సరంలో సుమారు 4 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉండగా, పదో సంవత్సరం నాటికి 10 టన్నుల వరకు దిగుబడి సాధించే అవకాశం ఉందన్నారు.

ప్రపంచంలో అత్యధికంగా నూనె దిగుబడిని ఇచ్చే పంటల్లో ఆయిల్పామ్ ముఖ్యమైనదని, వరి సాగుతో పోలిస్తే నీటి ఎద్దడి, కూలీల కొరత వంటి సమస్యలు తక్కువగా ఉంటాయని వివరించారు.



# నర్సింగ్ విద్యార్థిని అనుమానాస్పద మృతి

భద్రాద్రి కొత్తగూడెం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో నర్సింగ్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం గ్రామానికి చెందిన హరిణి (18) అనే యువతి అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. ఇంటి ఆవరణలోని బాత్రూమ్ వెనుక మృతదేహం లభించింది. పక్కింటి వ్యక్తి దారుణానికి పాల్పడ్డాడని మృతురాలి తల్లి ఆరోపణ. తండ్రి మరణించడంతో కూలి పనులు చేసి ఇద్దరు కూతుళ్లను తల్లి రాజేశ్వరి చదివిస్తోంది. సెలవుల నేపథ్యంలో హరిణి ఇటీవలే ఇంటికి వచ్చింది. అదే గ్రామంలోని చుట్టాల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేసరికి హరిణి కనిపించడంలేదని తల్లి వెతికింది. ఈ నేపథ్యంలో ఒంటిపై గాయాలతో, బాత్రూమ్ వెనుక హరిణి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రిమ్స్ బాధిత కుటుంబాలను పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు

అదిలాబాద్ ఆదిలాబాద్ రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో బాధిత కుటుంబసభ్యులను బీఆర్ఎస్ నేతలు బుధవారం పరామర్శించారు. బాధిత చిన్నారుల కుటుంబసభ్యులను రిమ్స్ ఆసుపత్రిలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, జోగు రామన్న, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు తుల ఉమ, బుక్యా జాన్సన్ నాయక్ పరామర్శించారు. బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తే, ఈ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పేద ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. రిమ్స్ ఆసుపత్రి ప్రమాదంలో మరణించిన చిన్నారుల కుటుంబాలకు రూ.25 లక్షలు, క్షతగాత్రులకు రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసారు.మరోవైపు, రిమ్స్ ప్రమాదంలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. మరో ఇరవై మంది చిన్నారుల పరిస్థితి విషమంగానే వుందని సమాచారం.

# చర్చలు విఫలం...

## ఐదు రోజులు బ్యాంకులు బంద్!

## సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల సమ్మె

న్యూఢిల్లీ దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ సేవలకు మరోసారి అంతరాయం ఏర్పడనుంది. బ్యాంకు యూనియన్లు, ప్రభుత్వ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో, యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్బీయూ దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. ఫలితంగా సెప్టెంబర్ చివరి వారంలో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకులు మూతపడనున్నాయి.వారానికి ఐదు రోజుల పనిదినాలు, ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ బ్యాంకు సంఘాలు కొంతకాలంగా నిరసనలు తెలుపుతున్నాయి. ఈ క్రమంలో ఆర్థిక శాఖ సూచన మేరకు మంగళవారం డిప్యూటీ లేబర్ కమిషనర్తో జరిపిన చర్చలు ఫలప్రదం కాలేదు. ఐదు రోజుల పని విధానం అంశం పరిశీలనలో ఉందని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ, స్పష్టమైన హామీ లభించకపోవడంతో యూనియన్లు అసంతృప్తి వ్యక్తం చేశాయి.ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు సమ్మె చేపట్టాలని నిర్ణయించాయి. సమ్మెకు ముందు సెప్టెంబర్ 26, 27 తేదీల్లో శని, ఆదివారాలు కావడంతో బ్యాంకులకు సాధారణ సెలవులు ఉన్నాయి. దీంతో మొత్తం ఐదు రోజుల పాటు బ్యాంకింగ్ లావాదేవీలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. ఇదే డిమాండ్లతో ఈ నెల 11న కూడా బ్యాంకు సంఘాలు సమ్మె నిర్వహించిన విషయం విదితమే. ఈ పరిణామాల దృష్ట్యా, వినియోగదారులు తమ ముఖ్యమైన ఆర్థిక లావాదేవీలను ముందుగానే పూర్తి చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు

# నోరు ఎత్తని టీడీపీ ఫైర్ బ్రాండ్స్...

విజయవాడ, సెప్టెంబర్ 23, ఆంధ్రప్రదేశ్‌లో అధికార తెలుగుదేశం పార్టీ లో కొంతకాలంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ముఖ్యంగా గతంలో తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు, అంతర్గత విభేదాలతో వార్తల్లో నిలిచిన కొందరు నేతలు ఇప్పుడు తమ నియోజకవర్గాల వ్యవహారాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనే చర్చ మొదలైంది. దీనికి పార్టీ అధిష్టానం అనుసరిస్తున్న క్రమశిక్షణ విధానమే కారణమా అనే ప్రశ్న కూడా వినిపిస్తోంది.2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొందరు టీడీపీ ఎమ్మెల్యేల వ్యవహారశైలి పార్టీకి ఇబ్బందికరంగా మారిందనే విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పేరు పలు సందర్భాల్లో చర్చకు వచ్చింది. ఆయనకు సంబంధించి పార్టీ కార్యకర్తల నుంచి అసంతృప్తి వ్యక్తమైన సందర్భాలు కూడా ఉన్నాయి. 2025లో తిరువూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ కార్యకర్తలు పార్టీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ కొలికపూడికి పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించినట్లు 2026 ఫిబ్రవరిలో వార్తలు వెలువడ్డాయి. అనంతరం తిరువూరు రాజకీయాల్లో విభేదాలను తగ్గించే ప్రయత్నాలు జరిగినట్లు కూడా సమాచారం వచ్చింది. 2026 మార్చిలో కొలికపూడి, ఎంపీ కేశినేని శివనాథ్ మధ్య నెలకొన్న వివాదానికి పరిష్కారం దిశగా చర్చలు జరిగినట్లు మరో కథనం పేర్కొంది.ఇటీవల కొలికపూడి నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారిస్తున్నట్లు కనిపిస్తోంది. సెప్టెంబర్ 19న తిరువూరు నియోజకవర్గంలోని అభివృద్ధి పనుల్లో పార్టీ కార్యకర్తలకు అవకాశం కల్పించేలా నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి.మరోవైపు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు వ్యవహారశైలిపై కూడా టీడీపీ వర్గాల్లో చర్చ జరుగుతోందనే ప్రచారం ఉంది. గతంలో ప్రభుత్వాన్ని, పార్టీ నిర్ణయాలను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. అయితే ఇటీవలి కాలంలో ఆయన బహిరంగ రాజకీయ వ్యాఖ్యలు తగ్గించుకున్నారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు విషయంలోనూ పార్టీ క్రమశిక్షణ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభకు ఆయన హాజరు కావడం, అక్కడి వ్యాఖ్యలు వివాదానికి దారితీయడంతో పార్టీ నుంచి వివరణ కోరినట్లు వార్తలు వచ్చాయి. అనంతరం బొండా ఉమా పార్టీ లైన్‌ను తాను ఉల్లంఘించలేదని పార్టీ కమిటీ ముందు వివరణ ఇచ్చినట్లు సమాచారం.ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ విషయంలోనూ ఇదే తరహా చర్చ వినిపిస్తోంది. మొత్తంగా చూస్తే, గతంలో తరచూ బహిరంగ వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచిన కొందరు నేతలు ప్రస్తుతం పార్టీ వ్యవహారాల్లో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. అయితే ఈ మార్పుకు ఖచ్చితమైన కారణం ఇదేనని నిర్ధారించే అధికారిక ప్రకటన మాత్రం లేదు. పార్టీ క్రమశిక్షణ, నాయకత్వ సూచనలు, నియోజకవర్గ రాజకీయ సమీకరణాలు కలిసి ఈ మార్పుకు కారణమై ఉండవచ్చనే చర్చ మాత్రమే ప్రస్తుతం కొనసాగుతోంది.

# న్యూక్లియర్ ఫ్యూజన్ లో భారత్ ముందడుగు

విజయవాడ, సెప్టెంబర్ 23, న్యూక్లియర్ ఫ్యూజన్ ఎనర్జీ రంగంలో భారత్ మరో మైలురాయిని అధిగమించింది. సూర్యుడి కేంద్రం కన్నా 20 రెట్ల వేడి ప్లాస్మాను సృష్టించారు. గుజరాత్‌లోని ప్లాస్మా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐపీఆర్)కు చెందిన ఆదిత్య-1 టోకామాక్‌పై కొత్త శక్తివంతమైన గైరో ట్రాన్ వ్యవస్థను విజయవంతంగా ప్రారంభించారు. ఇది 82.6 గిగాహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీ, 400 కిలోవాట్ల సామర్థ్యంతో పనిచేస్తుంది. టోకామాక్‌లోని అత్యంత వేడి ప్లాస్మాను మరింత వేడి చేయడానికి ఈ కొత్త పరికరం ఉపయోగపడుతుంది.స్టడీ స్టేట్ సూపర్‌కండక్టింగ్ టోకామాక్(ఆదిత్య-1) అనే పరికరం, నియంత్రిత పద్ధతుల్లో సూర్యుడిపై జరిగే న్యూక్లియర్ ఫ్యూజన్ ప్రక్రియను నిర్వహిస్తుంది. టోకామాక్‌లోని బలమైన అయస్కాంత క్షేత్రం ప్లాస్మాను నియంత్రిస్తుంది. తాజా పరిశోధనల్లో ప్లాస్మా ఉష్ణోగ్రత 20 కోట్ల డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా చేరింది. ఇది సూర్యుడి కేంద్రంలో ఉత్పత్తి అవుతున్న వేడి కన్నా దాదాపు 10-20 రెట్లు ఎక్కువ.గైరో ట్రాన్ అనేది అధిక ఫ్రీక్వెన్సీ మైక్రోవేవ్ శక్తిని ఉత్పత్తి చేసే ప్రత్యేక పరికరం. ఈ శక్తిని టోకామాక్‌లోని ప్లాస్మాలోకి పంపించడం ద్వారా దాని ఉష్ణోగ్రతను మరింత పెంచుతారు. ఆదిత్య-1లో ఇంతకుముందు 42 గిగాహెర్ట్జ్ జైరోట్రాన్ వ్యవస్థను ఉపయోగించారు. ఇప్పుడు ఏర్పాటు చేసిన 82.6 గిగాహెర్ట్జ్ వ్యవస్థ అధిక సామర్థ్యంతో ప్లాస్మాను వేడి చేయడానికి సహాయపడుతుంది.ఫ్యూజన్ ప్రక్రియలో ప్లాస్మాను అత్యంత వేడికి చేర్చడమే కాకుండా, దానిని తగిన సమయం పాటు స్థిరంగా ఉంచడం కూడా అత్యంత కీలకం. కొత్త గైరో ట్రాన్ ఈ ప్రయోగాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు సైంటిస్టులకు ఉపయోగపడింది.ఫ్యూజన్ (కేంద్ర సంలీన చర్య) ముఖ్యంగా సూర్యుడి వంటి నక్షత్రాల్లో జరుగుతుంది. దీని వల్ల అపారమైన శక్తి వెలువడుతుంది. స్వచ్ఛమైన భారీ స్థాయిలో శక్తిని అందించగల సామర్థ్యం దీని సొంతం. ఇందులో హైడ్రోజన్ ఐసోటోపులను ఇంధనంగా ఉపయోగించే అవకాశం ఉంది. హైడ్రోజన్ ఐసోటోపులు ఢీకొని హీలియంగా మారి, భారీ శక్తి విడుదల అవుతుందిప్రస్తుతం సాంప్రదాయ అణు విద్యుత్ కేంద్రాల్లో జరిగే న్యూక్లియన్ ఫిజన్(కేంద్ర విచ్ఛత్తి చర్య) వల్ల యురేనియం లేదా ప్లుటోనియం ఢీకొట్టుకోవడం వల్ల చిన్న కేంద్రకాలుగా విడిపోతుంది. దీని వల్ల శక్తి విడుదల అవుతుంది. ఫిషన్‌తో పోలిస్తే ఫ్యూజన్ చర్యలో దీర్ఘకాలికంగా నిల్వ చేయాల్సిన రేడియోధార్మిక వ్యర్థాల సమస్య తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. తక్కువ ఇంధనంతో భారీ శక్తిని ఉత్పత్తి చేయవచ్చు.అణు రియాక్టర్లలో న్యూక్లియన్ ఫిషన్ చర్య ఒక విచ్ఛత్తి మరో విచ్ఛత్తికి దారి తీసే చైన్ రియాక్షన్ ఉంటుంది. ఫ్యూజన్‌లో ప్లాస్మా పరిస్థితులు కొనసాగకుంటే ఫ్యూజన్ చర్య వెంటనే స్వయంగా ఆగిపోతోంది. దీని వల్ల పెద్ద ప్రమాదాలు ఉదాహరణకు చెర్నోబిల్ వంటి ప్రమాదాలు ఉండవు. ఫ్యూజన్ చర్యలో విడుదలయ్యే హీలియం రేడియో యాక్టివ్ కాదు. అణు వ్యర్థాల సమస్యే ఉండదు.

## 13 ప్రాంతాల్లో హైటెక్ బస్టాండ్లు...

నల్గొండ సెప్టెంబర్ 23, తెలంగాణలో ప్రజారవాణా వ్యవస్థను ఆధునీకరించే దిశగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై బస్టాండ్ అంటే కేవలం బస్సు కోసం వేచి చూసే ఇరుకు ప్రదేశం మాత్రమే కాకుండా, షాపింగ్, వినోదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చబోతోంది. తెలంగాణ ప్రభుత్వం, టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి వినూత్న ఆలోచనతో రాష్ట్రవ్యాప్తంగా 13 ప్రాంతాల్లో ఎయిర్‌పోర్ట్, కార్పొరేట్ స్థాయి హంగులతో మోడల్ బస్టాండ్లను నిర్మించేందుకు రవాణా శాఖ నుంచి అధికారిక ఆమోదం లభించింది.

నూతనంగా అందుబాటులోకి రానున్న ఈ హైటెక్ బస్ స్టేషన్లలో ప్రయాణికుల కోసం మల్టీ-మోడల్ కనెక్టివిటీని ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల బస్సు దిగిన వెంటనే రైల్వే స్టేషన్లు లేదా ఇతర రవాణా సాధనాలను సులభంగా చేరుకోవచ్చు. అంతేకాకుండా కమర్షియల్ బిజినెస్ కాంప్లెక్స్‌లు, మల్టీప్లెక్స్ రేంజ్ ఫుడ్ కోర్టులు, పిల్లల గేమింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లను అందుబాటులోకి తేనున్నారు. బిజినెస్ విస్తరణ కోసం వ్యాపారులు ఈ కాంప్లెక్స్‌లలో షాపులను కేటాయించుకోవచ్చని ఆర్టీసీ ప్రకటించింది.ప్రపంచ పటాలు పరిశీలించండి

తొలివిడతగా నాగర్‌కర్నూల్, రేగొండ, హుజూర్ నగర్, కోదాడ, కొడంగల్, కోస్గి, మద్దూరు, కేసముద్రం, హుస్నాబాద్, ములుగు, మధిర, నల్గొండ, కొత్తగూడెం ప్రాంతాల్లో ఈ మోడల్ బస్టాండ్లను నిర్మించనున్నారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్న ఈ ప్రాజెక్టుతో తెలంగాణ ఆర్టీసీ ప్రయాణికులకు మరింత నాణ్యమైన, ఆధునిక సేవలను అందించనుంది.

# దుర్గపు సుజాత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పొన్నం



కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండలం తాడికల్ గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు దుర్గపు సుజాత ఇటీవల మృతి చెందడంతో, తాడికల్ గ్రామంలోని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆమె నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దుర్గపు సుజాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం దుర్గపు సుజాత అందించిన సేవలను గుర్తు చేసుకోవడం జరిగింది. పార్టీ పట్ల వారికున్న అంకితభావం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం, గ్రామ అభివృద్ధి కోసం ఆమె చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని పేర్కొన్నారు.

ఆమె కుమారుడు, కుమార్తె చదువుల వివరాలను అడిగి తెలుసుకోవడం జరిగింది. వారు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగింది.

## నకిలీ విల్లా వెంచర్ బిల్డర్‌పై తెలంగాణ రెరా కొరడా!

హైదరాబాద్, సెప్టెంబర్ 23, తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ మోసపూరిత బిల్డర్లపై తన ప్రతాపాన్ని చూపుతూ మరో సంచలన తీర్పు వెలువరించింది. సరైన అనుమతులు లేని విల్లా ప్రాజెక్ట్ పేరుతో ఓ అమాయక మహిళ నుంచి రూ. 79 లక్షలు భారీగా వసూలు చేసి, ఆపై నిర్మాణం పూర్తి చేయకుండా చేతులెత్తేసిన ఓ కేటుగాడికి వ్యతిరేకంగా బాధితురాలికి అనుకూలంగా తీర్పునిచ్చింది. చట్ట నిబంధనలను ఉల్లంఘించి వినియోగదారులను మోసం చేసిన ఆ బిల్డర్‌కు భారీ జరిమానా విధిస్తూ రెరా కఠిన చర్యలు తీసుకుంది.ఎలాంటి చట్టపరమైన అనుమతులు, లేఅవుట్ అప్రూవల్స్ లేకపోయినా ఆకర్షణీయమైన ప్రకటనలతో సదరు బిల్డర్ విల్లా ప్రాజెక్ట్‌ను విక్రయిస్తున్నట్లు నమ్మించాడు. దీనిని నిజమని నమ్మిన బాధితురాలు విల్లా కొనుగోలు నిమిత్తం విడతలవారీగా మొత్తం రూ. 79 లక్షలను ఆ సంస్థకు చెల్లించింది. అయితే డబ్బులు తీసుకున్నప్పటికీ ప్రాజెక్ట్ పనులు ముందుకు సాగకపోగా, కనీస నిర్మాణాలు కూడా పూర్తి చేయకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు తక్షణమే న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ రెరాను ఆశ్రయించింది .బాధితురాలి ఫిర్యాదును అత్యంత సీరియస్‌గా పరిగణించిన టీఎస్‌రెరా అధికారులు ఇరువర్గాల వాదనలను విచారించి సమగ్ర దర్యాప్తు జరిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రాజెక్ట్ చేపట్టడం, డబ్బులు వసూలు చేసి మోసం చేయడం నిరూపితం కావడంతో రెరా చట్టం ప్రకారం బిల్డర్‌ను దోషిగా తేల్చారు. బాధితురాలి నుంచి వసూలు చేసిన అసలు మొత్తం రూ. 79 లక్షలను, ఎలాంటి జాప్యం లేకుండా చెల్లించాలని స్పష్టం చేసింది.అంతేకాకుండా, ఆ మొత్తంపై కాలయాపన చేసినందుకు గాను వార్షికంగా 10.7 శాతం వడ్డీని కలిపి బాధితురాలికి తిరిగి చెల్లించాలని రెరా తన తీర్పులో తేల్చిచెప్పింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి వినియోగదారులను మోసగిస్తే చట్టపరంగా ఎంతటి కఠిన చర్యలు ఉంటాయో ఈ తీర్పు ద్వారా మరోసారి రుజువైంది. సోషల్ మీడియా ప్రకటనలు, అనుమతులు లేని ప్రీలాంచ్ వెంచర్లను గుడ్డిగా నమ్మి మోసపోవద్దని, రియల్ ఎస్టేట్ లావాదేవీల్లో కొనుగోలుదారులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఈ ఘటన హెచ్చరిస్తోంది

# ఆత్మరక్షణలోకి బీఆర్ఎస్

హైదరాబాద్, సెప్టెంబర్ 23,తెలంగాణ రాజకీయంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా తీవ్రమైన సామాజిక సమీకరణాల పోరుగా రూపాంతరం చెందుతోంది. కేసీఆర్ కుటుంబంపై కేవలం అవినీతి, భూదోపిడి అనే కోణంలోనే కాకుండా.. తెలంగాణలో దశాబ్దాల పాటు సాగిన గడీల పాలన , దొరల అరాచకాలు అనే సామాజిక భయాన్ని ప్రజల మనసుల్లో బలంగా నాటడానికి కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇటీవల కేసీఆర్ ను ఉద్దేశించి చేసిన తీవ్ర వ్యాఖ్యలు, ఆపై వచ్చిన విమర్శలు.. దానికి కౌంటర్ గా వెలమ సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుంటూ ఆయన చేసిన హెచ్చరికలు కొత్త రాజకీయానికి కారణంగా కనిపిస్తున్నాయి.తెలంగాణ చరిత్రను పరిశీలిస్తే బడుగు, బలహీన వర్గాలు గడీల ఆధిపత్యానికి వ్యతిరేకంగా సాగించిన పోరాటాలకు సుదీర్ఘమైన నేపథ్యం ఉంది. తెలంగాణ ఉద్యమం ద్వారా ఆ సామాజిక అసంతృప్తి తాత్కాలికంగా పక్కకు వెళ్లినప్పటికీ, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్ణయాధికారాలన్నీ ఒకే కుటుంబం, నిర్దిష్ట సామాజిక వర్గం చేతుల్లోనే కేంద్రీకృతమయ్యాయనే భావన బీసీ, దళిత వర్గాల్లో బలంగా నాటుకుపోయింది. ఇప్పుడు ఇదే చారిత్రక అసంతృప్తిని ఆసరాగా చేసుకుని, కేసీఆర్ కుటుంబాన్ని కేవలం ఒక రాజకీయ శత్రువుగానే కాక, బహుజన వర్గాల అవకాశాలను ఆక్రమించిన సామాజిక ప్రతినిధిగా చిత్రీకరించేందుకు రేవంత్ పక్కా ప్రణాళికతో వ్యవహరిస్తున్నారు.

ఈ రాజకీయ క్రీడలో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మక సంకేతాలను పంపుతున్నారు. కేసీఆర్ కుటుంబం వద్ద ఉన్న ఆస్తులు, వారి సామాజిక వర్గం ఎంత ఉందో, వారు అనుభవిస్తున్న పదవులు ఎన్ని అనే అంశాలపై పరోక్షంగా, ప్రత్యక్షంగా సభల్లోను, సభల వెలుపల ప్రస్తావించడం ద్వారా ప్రజల్లో ఆలోచన రేకెత్తించే ప్రయత్నం చేస్తున్నారు. వెలమ దొరల పాలనలో నష్టపోయిన బహుజన బిడ్డలకు అధికారాన్ని అందించామనే నరేటివ్‌ను బలోపేతం చేయడం ద్వారా ప్రతిపక్ష బీఆర్ఎస్‌ను ఆత్మరక్షణలోకి నెట్టడమే రేవంత్ రెడ్డి మార్క్ రాజకీయ వ్యూహంగా కనిపిస్తోంది.శాసనసభ్యుడు వీర్లపల్లి శంకర్ లాంటి నేతలు మరింత దూకుడు ప్రదర్శిస్తున్నారు.కేసీఆర్‌ను ఉద్దేశించి చావు దప్పు కొడతాం అనడం, వెలమ సామాజిక వర్గాన్ని నేరుగా హెచ్చరిస్తూ పరుష పదజాలంతో విరుచుకుపడటం వెనుక.. బీఆర్ఎస్ కౌంటర్ దాడి చేస్తే దానిని దొరలు–బహుజనుల మధ్య ఘర్షణగా మలిచే ఆంతర్యం దాగి ఉందనేది కొట్టిపారేయలేము. తాండ్ర పాపారాయుడి పౌరుషం ప్రస్తావిస్తూ, సీఎం రేవంత్‌కి తెల్వకుండానే అంతు చూస్తాం అంటూ తొడగొట్టడం వెనుక కేవలం ఆవేశం మాత్రమే కాకుండా, వెలమ ఆధిపత్యాన్ని సవాల్ చేస్తున్నారనే భావనను దిగువ వర్గాల్లోకి బలంగా పంపాలనే ఆలోచన స్పష్టమవుతోంది.బిఆర్ఎస్ తన పది సంవత్సరాల పాలనలోని అభివృద్ధిని చూపి పుంజుకోవాలని చూస్తుంటే, కాంగ్రెస్ సర్కార్ మాత్రం కేసీఆర్ కుటుంబాన్ని పొలిటికల్‌గా మాత్రమే కాకుండా సోషియో–పొలిటికల్‌గా కార్నర్ చేయడానికి సిద్ధమైంది. సెంటిమెంట్లు, కుల సమీకరణాలు అత్యంత సున్నితంగా ఉండే తెలంగాణ రాజకీయాల్లో ఈ సామాజిక వర్గాల ‘ వ్యతిరేక ప్రచారం రాబోయే రోజుల్లో ఎంతటి విధ్వంసకర రాజకీయ పరిణామాలకు దారితీస్తుందో, ఎవరికి రాజకీయ లబ్ధి చేకూరుస్తుందో వేచి చూడాలి.

# అశ్వవాహనం పై శ్రీవారు ?

### అశ్వ వాహనంపై కల్కి అలంకారంలో శ్రీమలయప్ప స్వామివారి దివ్యదర్శనం

### గోవిందనామస్మరణతో మార్మోగిన తిరుమాడ వీధులు

### భక్తిభావంతో అలరించిన భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాలు

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన మంగళవారం రాత్రి అశ్వ వాహనంపై కల్కి అలంకారంలో శ్రీమలయప్ప స్వామివారు భక్తులకు దివ్యదర్శనమిచ్చారు.అశ్వ వాహనానికి ముందు గజరాజులు నడుస్తుండగా, భక్త బృందాల భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష, మంగళవాయిద్యాల నడుమ వాహనసేవ అత్యంత వైభవంగా జరిగింది. విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ గోవిందనామస్మరణతో స్వామివారిని దర్శించుకున్నారుఇంద్రియ నియంత్రణకు అశ్వ వాహనం సందేశంఉపనిషత్తులు ఇంద్రియాలను గుర్రాలతో పోలుస్తాయి.అశ్వాన్ని అధిరోహించిన పరమాత్మ ఇంద్రియాలను నియమించే నియామకుడిగా ఈ వాహనసేవ ద్వారా తెలియజేస్తున్నారు.

## హైదరాబాద్‌లో నీటి వృథాపై జలమండలి కఠిన చర్యలు

## జూబ్లీహిల్స్‌లో ఐదుగురు వినియోగదారులకు జరిమానా

హైదరాబాద్, సెప్టెంబర్ 23, నగరంలో తాగునీటి వృథాను అరికట్టేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ కఠిన చర్యలకు ఉపక్రమించింది. సోమవారం జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన అధికారులు, తాగునీటిని వాహనాలు కడగడానికి, ఫ్లోర్‌లు శుభ్రం చేయడానికి వాడుతున్న ఐదుగురు వినియోగదారులకు జరిమానాలు విధించారు. ట్యాంకులు నిండి పొంగిపోతున్నా, నల్లాలు వదిలేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రారంభంలో అవగాహన కార్యక్రమాలు, హెచ్చరికలతో సరిపెట్టిన జలమండలి, మార్పు రాకపోవడంతో జరిమానాలను భారీగా పెంచింది. నిబంధనల ఉల్లంఘన తీవ్రతను బట్టి రూ.1,000 నుంచి రూ.5,000, రూ.10,000, గరిష్ఠంగా రూ.20,000 వరకు జరిమానాలు విధిస్తున్నారు. పదేపదే నీటిని వృథా చేసేవారి నల్లా కనెక్షన్లను శాశ్వతంగా తొలగిస్తామని స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం జూబ్లీహిల్స్‌లోని రోడ్ నెం. 23లో ఫ్లోర్ క్లీనింగ్‌కు తాగునీరు వాడుతున్న పూర్ణిమ అనే వినియోగదారురాలికి రూ.20,000 జరిమానా విధించడం గమనార్హం.ఈ తనిఖీలను నగరం అంతటా విస్తరిస్తున్నారు. సోమవారం సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని ఎస్కే నగర్‌లో అక్రమంగా మోటార్ వాడుతున్నందుకు ఒకరికి రూ.5,000, అల్కాపురి యాదవ్ నగర్‌లో తాగునీటితో ఫ్లోర్ కడుగుతున్నందుకు మరొకరికి రూ.1,000 ఫైన్ వేశారు.నగరంలో పెరుగుతున్న నీటి డిమాండ్, ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, మంజీరా–సింగూరు జలాశయాల్లో నీటి మట్టాలు తగ్గడం వల్లే ఈ కఠిన చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. “ఈరోజు మనం వృథా చేసే ప్రతీ నీటి చుక్క, రేపు మరొకరి దాహార్తిని తీర్చగలదు” అని బోర్డు పేర్కొంది.అదే సమయంలో తమ సిబ్బందికి కూడా జలమండలి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. నగరంలోని 15,000 కిలోమీటర్ల పైప్‌లైన్లలో ఎక్కడైనా లీకేజీ ఫిర్యాదు వస్తే 24 గంటల్లోగా శాశ్వత పరిష్కారం చూపాలని, తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకునే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించింది. నీటి దుర్వినియోగంపై ప్రజలు 99499 30003 అనే వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని బోర్డు సూచించింది. నీటి సంరక్షణ అనేది వినియోగదారులు, జలమండలి ఉమ్మడి బాధ్యత అని పేర్కొంది.

# భాగ్యనగరంలో తగ్గిన రియల్ జోరు...

# నిలబెడుతున్న ఐటీ, జీసీసీలు

హైదరాబాద్, సెప్టెంబర్ 23, కొన్నేళ్లుగా అనూహ్యమైన వృద్ధిని నమోదు చేసిన హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం ఇప్పుడు కాస్త నెమ్మదించింది. నివాస గృహాల విక్రయాలు మందగించినప్పటికీ, రికార్డు స్థాయిలో ఆఫీస్ స్పేస్ లీజింగ్, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ) విస్తరణతో ఉద్యోగాల ఆధారిత డిమాండ్ బలంగా ఉంది. దీంతో రియల్టీ రంగం కుప్పకూలిపోయే ప్రమాదం ఏమీ లేదని, కాస్త జాగ్రత్తపడే దశలోకి ప్రవేశించిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక ప్రకారం, 2026 ప్రథమార్థంలో హైదరాబాద్‌లో 19,249 నివాస గృహాల అమ్మకాలు జరిగాయి. ఇది గతేడాదితో పోలిస్తే కేవలం ఒకశాతం మాత్రమే అధికం. కొత్త ప్రాజెక్టుల ప్రారంభం 2 శాతం తగ్గి 20,466 యూనిట్లుగా నమోదైంది. అయితే, ఇళ్ల సగటు ధరలు మాత్రం 7 శాతం పెరిగి చదరపు అడుగుకు రూ. 8,258కి చేరాయి. అమ్ముడుకాని ఇళ్ల సంఖ్య 3 శాతం పెరిగి 56,095 యూనిట్లకు చేరింది. గచ్చిబౌలి, కొండాపూర్, కోకాపేట, నియోపోలిస్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి పశ్చిమ హైదరాబాద్ ప్రాంతాలు ఇప్పటికీ మార్కెట్‌లో ఆధిపత్యం చెలాయిస్తున్నాయి.అయితే, క్రెడాయ్ హైదరాబాద్–క్రి మ్యాట్రిక్స్ నివేదికలో భిన్నమైన గణాంకాలు వెల్లడయ్యాయి. ఈ నివేదిక ప్రకారం, ఈ ఏడాది ప్రథమార్థంలో అమ్మకాలు 13 శాతం తగ్గి 26,068 యూనిట్లుగా నమోదయ్యాయి.నివాస గృహాల మార్కెట్ మిశ్రమంగా ఉన్నప్పటికీ, వాణిజ్య సముదాయాల మార్కెట్ మాత్రం దూసుకుపోతోంది. 2026 ప్రథమార్థంలో ఆఫీస్ స్పేస్ లావాదేవీలు 29 శాతం పెరిగి రికార్డు స్థాయిలో 7.5 మిలియన్ చదరపు అడుగులకు చేరాయి. ఇందులో జీసీసీల వాటానే 45 శాతం (3.4 మిలియన్ చదరపు అడుగులు) ఉండటం గమనార్హం. ప్రస్తుతం నగరంలో 515కు పైగా జీసీసీలు ఉండగా, వీటిలో 3 లక్షల మందికి పైగా నిపుణులు పనిచేస్తున్నారు. రాబోయే 3–5 ఏళ్లలో జీసీసీల ద్వారా మరో 8–12 మిలియన్ చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ ఏర్పడవచ్చని అనరాక్ రీసెర్చ్ అంచనా వేసింది. “జీసీసీల విస్తరణ నగరంలో రియల్ ఎస్టేట్ డిమాండ్‌ను గణనీయంగా పెంచుతోంది” అని అనరాక్ గ్రూప్ ఛైర్మన్ అనూజ్ పురి తెలిపారు.మరోవైపు, ప్రతిపాదిత మెట్రో ఫేజ్–2, రీజినల్ రింగ్ రోడ్ వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు కూడా రియల్టీ అంచనాలను ప్రభావితం చేస్తున్నాయి. అయితే, పెరుగుతున్న ధరల వల్ల అందుబాటు ధరల్లో ఇళ్లు దొరకడం సవాలుగా మారుతోంది. డెవలపర్లు ఎక్కువగా ప్రీమియం ప్రాజెక్టులపదృష్టి పెడుతున్నారు.మొత్తం మీద హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఒక పరిణితి చెందిన దశకు చేరుకున్నట్లు కనిపిస్తోంది. ఉద్యోగ కల్పన, మౌలిక సదుపాయాలు, అందుబాటు ధర వంటి అంశాలే భవిష్యత్తులో ఈ రంగం వృద్ధిని నిర్దేశించనున్నాయని స్పష్టమవుతోంది.

# దానం గెలిస్తే...అమత్యా గ్యారంటి

హైదరాబాద్, సెప్టెంబర్ 23, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేస్తూ ఇచ్చిన తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో నూతన సమీకరణాలకు తెరలేపింది. బి–ఫామ్‌పై ప్రత్యక్షంగా మరో పార్టీ తరఫున పోటీ చేయడమే ఆధారంగా హైకోర్టు డివిజన్ బెంచ్ చారిత్రాత్మక తీర్పు ఇవ్వడంతో, దానం పొలిటికల్ కెరీర్ ఒక కీలకమైన మలుపు వద్దకు వచ్చింది. తొలుత ఉపఎన్నికకు సిద్ధమని ప్రకటించినప్పటికీ, న్యాయ నిపుణుల సలహాతో దానం నాగేందర్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే, స్పష్టమైన దస్తావేజు ఆధారాలు ఉన్న ఈ కేసులో సుప్రీంకోర్టు నుండి తక్షణ స్టే దక్కడం సులువు కాదనేది చట్ట నిపుణుల అంచనా.న్యాయస్థానాల్లో సుదీర్ఘంగా సాగే ప్రక్రియ ద్వారా విచారణను ఆలస్యం చేయడం కంటే, దానం నాగేందర్ నేరుగా ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ఉపఎన్నికను ఎదుర్కొనడమే ఆయన రాజకీయ భవిష్యత్తుకు అత్యంత ప్రయోజనకరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ కేబినెట్‌లో గ్రేటర్ హైదరాబాద్ పరిధికి చెందిన బలమైన బిసి నాయకుడి ప్రాతినిధ్యం లేకపోవడం ఒక రాజకీయ లోటుగా ఉంది. దానం నాగేందర్ వంటి సీనియర్, బహుళ ప్రజాదరణ ఉన్న హైదరాబాద్ బిసి నేత మంత్రివర్గంలో ఉంటే గ్రేటర్ పరిధిలో పార్టీకి మరింత మైలేజ్ వస్తుందని కాంగ్రెస్ అధిష్టానం కూడా భావిస్తోంది.ఒకవేళ దానం నాగేందర్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఘన విజయం సాధిస్తే, ఆయన రాజకీయ ఇమేజ్ ఒక్కసారిగా మారిపోతుంది. పార్టీ ఫిరాయింపుల ముద్రను, చట్టపరమైన అనర్హత వేటును నియోజకవర్గ ప్రజల తీర్పు ద్వారా చెరిపేసుకున్నట్లు అవుతుంది. అసెంబ్లీలోకి అడుగుపెడితే, ఆయన రాజకీయ నైతికతకు తిరుగులేని బలం చేకూరుతుంది. అప్పుడు ఆయనకు గ్రేటర్ హైదరాబాద్ కోటాలో కేబినెట్ బెర్త్ కేటాయించడం సీఎం రేవంత్ రెడ్డికి కూడా సులభం, అనివార్యం కానుంది. ఖైరతాబాద్ నియోజకవర్గ క్షేత్రస్థాయి సమీకరణాలు కూడా దానంకు పూర్తి అనుకూలంగా ఉన్నాయి. దశాబ్దాలుగా ప్రతి బస్తీలో ఆయనకు ఉన్న సొంత అనుచరగణం, వ్యక్తిగత పట్టు కాదనలేని సత్యం. ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీ వద్ద దానం స్థాయిని తట్టుకుని నిలబడే లోకల్ ఫేస్ గానీ, బలమైన సంస్థాగత కేడర్ గానీ అందుబాటులో లేదు.రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ బలం, అభివృద్ధి సంక్షేమ పథకాలు తోడైతే ఉపఎన్నికలో గెలుపు నల్లేరుపై నడకేనని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. సుప్రీంకోర్టులో కేవలం విచారణల చుట్టూ కాలయాపన చేస్తూ ఉంటే.. నియోజకవర్గంలో అనుమానాలు, ప్రత్యర్థుల ప్రచారాలు ఎక్కువయ్యే ప్రమాదం ఉంది. దానికంటే కోర్టుల కంటే ప్రజా కోర్టు పెద్ది అనే నినాదంతో ఉపఎన్నికల బరిలోకి దిగి, స్పష్టమైన మెజారిటీ సాధించడమే దానం నాగేందర్ స్థానాన్ని, రాజకీయ ఆధిపత్యాన్ని పునరుద్ధరిస్తుంది. కోర్టుల్లో స్టేల కోసం పోరాడటం కంటే ప్రజాక్షేత్రంలో తాడోపేడో తేల్చుకో?మే దానం నాగేందర్‌ను ఖైరతాబాద్‌కే కాదు, ఏకంగా సెక్రటేరియట్‌లోని మంత్రి పీఠం వైపు నడిపించే వ్యూహాత్మక మార్గమని ఎక్కువ మంది సలహాలిస్తున్నారు.

# తొలి స్టోర్‌తో హై–స్ట్రీట్ ఫ్యాషన్ బ్రాండ్ కెల్లీ ఫెల్డర్

హైదరాబాద్ బంజారా హిల్స్ లో తొలి స్టోర్‌తో అంతర్జాతీయ హై–స్ట్రీట్ ఫ్యాషన్ బ్రాండ్ కెల్లీ ఫెల్డర్ భారత్‌లోకి అడుగుపెట్టింది. కొలంబో, మెల్‌బోర్న్ తర్వాత హైదరాబాద్‌ను భారత తొలి స్టోర్‌కు వేదికగా ఎంచుకుంది. నటి నేహా శర్మ ముఖ్య అతిథిగా హాజరైన ఈ ప్రారంభోత్సవంలో ఫ్యాషన్ ప్రియులు, కంటెంట్ క్రియేటర్లు పాల్గొన్నారు. మహిళలు, పురుషుల దుస్తులు, పెర్ఫార్మెన్స్‌వేర్, యాక్సెసరీస్‌తో కలెక్షన్లను అందుబాటులోకి తెచ్చిన కెల్లీ ఫెల్డర్, త్వరలో దేశంలోని ఇతర నగరాలకు విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

# ఎయిర్ పోర్టు క్రెడిట్ కోసం రేవంత్

వరంగల్ సెప్టెంబర్ 23, తెలంగాణ సంస్కృతికి, పోరాటాల చరిత్రకు వరంగల్ జిల్లా గుండెకాయ లాంటిది.

ఓరుగల్లు మట్టికి ఉన్న రాజకీయ, భావోద్వేగ ప్రాముఖ్యత హైదరాబాద్‌ను మించి ఉంటుంది.

అలాంటి చారిత్రాత్మక వరంగల్‌లోని దశాబ్దాల కల అయిన మామునూరు ఎయిర్‌పోర్ట్ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వ్యూహం ప్రత్యేకమైనది. ఎయిర్‌పోర్ట్ రన్ వేలు, టెర్మినల్ భవనాల నిర్మాణం ఇంకా తొలి దశలోనే ఉన్నప్పటికీ.. ఈ కొత్త ఎయిర్‌పోర్ట్‌కు ఏ పేరు పెడితే బాగుంటుంది? మీ సూచనలు తెలపండి అంటూ సీఎం రేవంత్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా వేసిన ఒకే ఒక్క ప్రశ్న ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎమోషనల్ అండ్ పొలిటికల్ డిబేట్‌గా మారింది.కార్యరూపంలో ఒక పనిని పూర్తి చేయడం ఒకెత్తయితే, దాని నుంచి గరిష్ట రాజకీయ ప్రయోజనాన్ని, క్రెడిట్ ను తమ ఖాతాలో వేసుకోవడం మరొక ఎత్తు. ఈ విషయంలో రేవంత్ రెడ్డి అందరికంటే రెండు అడుగులు ముందే ఉన్నారని చెప్పవచ్చు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మామునూరు ఎయిర్‌పోర్టుకు భూసేకరణ జరగలేదని, బీఆర్ఎస్ నేతలు కేవలం ఫామ్‌హౌస్‌లకే ప్రాధాన్యమిచ్చారని విమర్శిస్తూనే.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.295 కోట్ల నిధులు కేటాయించి, 280 ఎకరాల భూసేకరణ పూర్తి చేసి ఏఏఐ కి అప్పగించిన విషయాన్ని రేవంత్ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారు. టెండర్ల ప్రక్రియ రూ.213 కోట్లతో ప్రారంభమైన వెంటనే 'పేరు సూచించండి' అని పిలుపునివ్వడం ద్వారా ప్రాజెక్ట్ సాధన క్రెడిట్ మొత్తాన్ని తన ఖాతాలోకి లాక్కోగలిగారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం తర్వాత తెలంగాణలో ప్రస్తుతం మరే ఇతర రవాణా ఎయిర్‌పోర్ట్ లేకపోవడం వల్ల.. ఉత్తర తెలంగాణకు వరంగల్ ఎయిర్‌పోర్టే ఏకైక లైఫ్‌లైన్‌గా మారబోతోంది. ఇది కేవలం రవాణా సౌకర్యం మాత్రమే కాదు; కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఐటీ రంగాలు, రామప్ప దేవాలయం, వెయ్యి స్తంభాల గుడి వంటి పర్యాటక ప్రాంతాలకు ఒక న్యూ గ్లోబల్ గేట్‌వే అని చాటిచెప్పడం ద్వారా రేవంత్ ఓరుగల్లు ప్రజల ఆకాంక్షను తట్టారు. ఈ 'నేమ్ గేమ్' పిలుపునకు సోషల్ మీడియా నుంచి, సినీ రంగానికి చెందిన ప్రముఖుల నుంచి అనూహ్యమైన స్పందన లభించింది. వరంగల్‌కు చెందిన ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా స్పందిస్తూ రుద్రమ అంతర్జాతీయ విమానాశ్రయం లేదా కాకతీయ అంతర్జాతీయ విమానాశ్రయం అనే పేర్లను సూచించగా, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సమ్మక్క-సారలమ్మ , నటుడు విజయ్ దేవరకొండ, బండ్ల గణేష్, ఇతర నేతలు కాకతీయ , పి.వి. నరసింహారావు , 'చాకలి ఐలమ్మ వంటి చారిత్రాత్మక పేర్లను లేవనెత్తారు.

సందీప్ వంగాకు రేవంత్ ఇచ్చిన దట్స్ ది స్పిరిట్ రిప్లై కూడా సోషల్ మీడియాలో ట్రెండ్ అయ్యింది.దీని ద్వారా రేవంత్ సాధించిన రాజకీయ ప్రయోజనం ఏంటంటే.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పూర్తయి అందుబాటులోకి రావడానికి కనీసం మరో రెండేళ్లు సమయం పడుతుంది. కానీ, ఈ పేరు చుట్టూ నడిచే చర్చ వల్ల వరంగల్, కరీంనగర్, ఖమ్మం వంటి కీలక జిల్లాల ప్రజల మనస్సులో మామునూరు ఎయిర్‌పోర్టును మళ్లీ ట్రాక్‌పైకి తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే.. రేవంత్ రెడ్డి చొరవతోనే ఇది సాధ్యమైంది అనే బలమైన ముద్ర పడింది. నిర్మాణం పూర్తికాకముందే ఎమోషనల్ కనెక్ట్‌ను క్రియేట్ చేయడంలో సీఎం సక్సెస్ అయ్యారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ దీనిపై ఎంతగా ఎదురుదాడి చేయాలని చూసినా, భూసేకరణ పూర్తికావడం, ఆంక్షల క్లియరెన్స్ సాధించడం, టెండర్లు పడటం వంటి సాంకేతిక ఆధారాలు కాంగ్రెస్ వైపే ఉన్నాయి. ఎయిర్‌పోర్ట్ పేరుపై చర్చ పెట్టడం ద్వారా తెలంగాణ మూలాలను, ప్రజాభిప్రాయాన్ని గౌరవిస్తున్నారనే భావన కల్పిస్తూనే.. రాబోయే రోజుల్లో వరంగల్‌లో కాంగ్రెస్ తన రాజకీయ పట్టును మరింత పటిష్టం చేసుకునే దిశగా సీఎం రేవంత్ రెడ్డి తెలివైన పావును కదిపారని భావిస్తున్నారు.

## టీచర్ల పై దాడిలో జగన్ కీలక సూత్రధారి.. కుట్రదారుడు

## టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు బుద్దా వెంకన్న

విజయవాడ అవినాష్, వెల్లంపల్లి, విష్ణు వంటి ఆకు రౌడీలు,మాజీ వైసిపి ప్రజాప్రతినిధులు మొన్న శాప్ కార్యాలయం వద్ద అరాచకం చేశారు. శాంతిభద్రతల కు విఘాతం కలిగిస్తూ, ప్రజలను భయపెడుతున్నారు. మా సహనాన్ని పరీక్షిస్తున్నారు.. మా అధిష్టానం మా చేతులు కట్టేసిందని టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు బుద్దా వెంకన్న అన్నారు.

భుదవారం అయన మీడియాతో మాట్లాడారు. పోలీసులు గేట్లు మూసి తాళాలు వేయకుంటే.. ఉపాధ్యాయులు ను ఈ ఆకు రౌడీలు చంపేసే వారు. కష్టపడి ఉద్యోగాలు తెచ్చుకుంటే వారి పై మీకు పగ ఎందుకు. రాష్ట్రం లో అలజడి సృష్టించాలని జగన్ చెబుతున్నాడు.. వీళ్లు దాడి చేస్తున్నారు. నేడు జగన్ ఏ ముఖం పెట్టుకుని గవర్నర్ ను కలుస్తారు. నీ రౌడీలతో దాడులు చేయించి .. సిగ్గులేకుండా గవర్నర్ కు కూడా అబద్దాలు చెబుతావా అని ప్రశ్నించారు.నీ నీచ బుద్ధి ని ప్రజలు గమనించరు అనుకుంటున్నావా. టిడిపి కేంద్ర కార్యాలయం పై దాడి చేసిన వారిలో 51 మంది నిన్న ఉపాధ్యాయులు పై దాడికి వచ్చారని పోలీసులు గుర్తించారు. మొన్న మీ హడావుడి చూసి ప్రజలు భయ పడుతున్నారు. రాష్ట్రం లో అల్లర్లు చేసే వారి సంగతి పోలీసులు తేల్చాలి. ఉల్లిపాయ బాంబులాంటి వారు మీరంతా. అధికారం లో నోరు పారేసు కున్న వారు ఇప్పుడు అన్నీ మూసుకున్నారు. మీకు దమ్ముంటే అరాచకం చేసిన ప్రదేశానికి రండి..ప్రజలు తరమికొడతారు. మొన్న జరిగిన దాడి కి సూత్రధారి జగన్ .. ఇప్పుడు వారందరినీ తాడేపల్లి ప్యాలెస్ లో ఉంచి కాపాడుతున్నాడు. జగన్మోహన్ రెడ్డి ని ఈ కేసులో కుట్ర దారుడిగా చేర్చాలి. నేనే డిజిపిని కలిసి జగన్ పై ఫిర్యాదు చేస్తా. తలశిల రఘురాం, అవినాష్ వంటి వారంతా ఇప్పుడు ప్యాలెస్ లో దాక్కున్నారు. అమాయక ఉపాధ్యాయులు పై దాడి చేయించిన జగన్ ను అరెస్టు చేయాలి. నేను జగన్ పై ఫిర్యాదు ఇస్తాను.. కుట్రదారుడిగా చేర్చాలి. మేము గతంలో ఎన్నో ఆందోళనలు చేసినా ఎప్పుడూ ఇలా దిగజారి ప్రవర్తించలేదు. స్పోర్ట్స్ కోటాలో ఉపాధ్యాయులు అయిన వారిని చంపాలనేదే వారి కుట్ర. మొన్న దాడిలో జగన్ కీలక సూత్రధారి.. కుట్రదారుడు. అతనిపై కేసు పెట్టి అరెస్టు చేసే వరకు పోరాడతా. విజయవాడ లో ఆందోళన లు చేయాలంటే ధర్నా చౌక్ ఉంది. మేమంతా గతంలో అక్కడే కార్యక్రమాలు చేశాం. మరి ఇతర ప్రాంతాల నుంచి రౌడీలను ఎందుకు తెచ్చారు. బందరు రోడ్ లో మూడు గంటల పాటు హల్ చల్ చేశారు. ఆకు రౌడీలతో పాటు, వారిని నడిపిస్తున్న జగన్ ను అరెస్టు చేయాల్సిందే. వైసిపి స్వార్ధ రాజకీయాల కోసం కష్టపడి ఉద్యోగాలు తెచ్చుకున్న వారిని అవమానిస్తున్నారు. ఉద్యోగులు, ప్రజలు అందరూ కలిసి వైసిపి కి బుద్ధి చెప్పాలని అన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో కృష్ణా జిల్లాలో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు

### ప్రజలు అత్యవసర సమాచారం కోసం 08672-252399 నంబర్‌కు ఫోన్ చేయాలి

మచిలీపట్నం, సెప్టెంబరు 23, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన/డిప్రెషన్ ప్రభావంతో కృష్ణా



జిల్లాతో పాటు కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజలకు తక్షణ సహాయం, సమాచారం అందించేందుకు మచిలీపట్నంలోని జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటలూ పనిచేసే జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఘ జిల్లా మేజిస్ట్రేట్ శ్రీ డి.కె. బాలాజీ, ఐ.ఏ.ఎస్. తెలిపారు.భారత వాతావరణ శాఖ (ఎఓఆ) నేషనల్ బులెటిన్ నం.3 ప్రకారం, పశ్చిమ మధ్య మరియు దానికి ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన డిప్రెషన్ గత ఆరు గంటల్లో గంటకు 17 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ 2026 సెప్టెంబరు 22వ తేదీ ఉదయం 5.30 గంటలకు 17.9ళీఔ అక్షాంశం, 86.3ళీఇ రేఖాంశం వద్ద కేంద్రీకృతమై ఉంది.ఈ డిప్రెషన్ తదుపరి 12 గంటల్లో డీప్ డిప్రెషన్‌గా బలపడే అవకాశం ఉందని, అనంతరం పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ విశాఖపట్నం?గోపాలపురం మధ్య ఉత్తర ఆంధ్రప్రదేశ్?దక్షిణ ఒడిశా తీర ప్రాంతాన్ని సెప్టెంబరు 23వ తేదీ రాత్రి నుంచి 24వ తేదీ తెల్లవారుజాము మధ్య డీప్ డిప్రెషన్‌గా దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.ఈ వాతావరణ పరిస్థితుల ప్రభావంతో సెప్టెంబరు 22 నుంచి 25వ తేదీ వరకు కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో అక్కడక్కడా అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది.కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్: 08672-252399భారీ వర్షాల పరిస్థితికి సంబంధించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమాచారం, అత్యవసర పరిస్థితులను స్వీకరించి సంబంధిత అధికారులకు తెలియజేసేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 24 గంటలూ పనిచేస్తుంది.ప్రజలు భారీ వర్షాలు, నీటి నిల్వలు, వరద పరిస్థితులు తదితర అంశాలకు సంబంధించిన సమాచారాన్ని 08672-252399 నంబర్‌కు తెలియజేయవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు.కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించే సిబ్బందికంట్రోల్ రూమ్ నిరంతరాయంగా పనిచేసేలా సిబ్బందిని షిఫ్ట్‌ల వారీగా నియమించారు.

# ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం చేయాలి

### మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ

### ఏర్పాట్లు చేసిన మున్సిపాలిటీ అధికారులు

**ఖమ్మం జిల్లా బ్యూరో సెప్టెంబర్ 23 ప్రజాబలం:**గణేష్ నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజులు పాటు ప్రత్యేక పూజలు అందుకున్న వినాయకుడు శోభాయాత్రకు బుధ గురువారాల్లో జరిగే సామూహిక గణేష్ నిమజ్జనోత్సవం నిర్వహించేందుకు మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నల్లచెరువు వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెవిన్యూ మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. నిమజ్జనం దగ్గర క్రేన్ ఉంచారు.ఆన్లైన్ ద్వారా నిర్వాహకులు నమోదు చేసుకున్నారని వీటిని నిమజ్జనం కొరకు బుధవారం గురువారాల్లో పటిష్ట చర్యలుతీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణతెలిపారు.. ప్రశాంతమైన వాతావరణంలో నిమజ్జనం చేసుకోవాలని మండప నిర్వాహకులకుఆమె సూచించారు. నిమజ్జనం అనంతరం పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచేందుకు స్వచ్ఛందంగా సహకరించాలని ఆమె తెలిపారు పరిశుభ్రమైన



పచ్చని వైరా కోసం మనందరం బాధ్యత తీసుకోవాలని ఆమె సూచించారు పోలీసులు సూచించిన మేరకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని భక్తులు సహకరించాలని అన్నారు.ఊరేగింపులో డిజీలు భారీ శబ్దాలు ప్రమాదకర విన్యాసాలు దూరంగా ఉండాలని పరిమితికి మించి వ్యక్తులు ను ఎక్కించవద్దని ఊరేగింపు సమయంలో మద్యం తాగి వాహనాలను నడపటం ఇతరలు ఇబ్బంది కలిగించడం వంటి పాల్పడుద్దని ఎక్కడైనా అవాంఛనీయ సంఘటన జరిగిన వెంటనే సమీపంలో పోలీసులకు సమాచారం అందించాలని ఆమె తెలిపారు. దాదాపు బుధ గురువారాల్లో 80 పైగా విగ్రహాలను నల్లచెరువుకు నిమజ్జనానికి వస్తాయని అంచనా వేస్తున్నామని చంద్రకళ తెలిపారుగణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు భక్తులు సహకరించాలని అధికారులు కోరారు.

## ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ లడ్డూ ప్రసాదం ఏటీఎం ఇవాల్టి నుంచీ అందుబాటులోకి

### 100, 200, 300, 400 రూపాయల బాక్సుల రూపంలో అందుబాటులోకి ప్రసాదం

### బాక్సుకు 6 లడ్డూలు, బాక్సు ఒకటి 100 రూపాయలు

### ఏటీఎం మాదిరిగా ఆప్షన్స్ సెలెక్ట్ చేసుకుని లడ్డూలు పొందే సదుపాయం

విజయవాడ ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ ఆలయంలో లడ్డూ ప్రసాదం విక్రయించే ఏటీఎం అందుబాటులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ మాట్లాడుతూ భక్తులు ఎక్కువ వచ్చే దేవాలయాలలో డిజిటైజేషన్, ఆటోమేషన్ ప్రక్రియ జరుగుతుంది. దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో మొట్టమొదటిసారిగా ప్రసాదం వెండింగ్ మెషీన్ ప్రారంభించాం. యూపీఐ యాప్ ల ద్వారా చెల్లించి తీసుకోవచ్చు. దేవస్థానం సిబ్బంది ప్రమేయం లేకుండానే వినియోగించుకోవచ్చు. ప్రధానంగా పండుగ రోజుల్లో లిమిట్ ఉంటుంది. 6 లక్షల ఖర్చుతో మెషీన్ ఏర్పాటు చేసాం. 70 నుంచీ 80 శాతం వరకూ ఆన్ లైన్ సేవా టికెట్లే ఉంటున్నాయి. ఆర్జిత సేవా టికెట్ల విషయంలో థర్డ్ పార్టీ లను నమ్మద్దు. ఆన్ లైన్ విధానం పారదర్శకత కోసమేనని అన్నారు.

భక్తులు ఎవరూ ఎవరినీ సంప్రదించక్కర్లేదు. ఆన్ లైన్ లేదా మనమిత్ర ద్వారా మాత్రమే టికెట్లు ఉంటాయి. భక్తుల రద్దీ అనుగుణంగా ప్రత్యక్ష పూజలు పై నిర్ణయం ఉంటుంది. లక్షన్నర పైగా భక్తులు వస్తే వారికి దర్శనం కల్పించాలి. లక్షలాది భక్తుల సౌకర్యమే ప్రధమ ప్రధాన్యత. తప్పు జరిగితే చట్ట ప్రకారం శిక్షలుంటాయని అన్నారు.

## ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయిన డిప్యూటీ సీఎం భట్టి




హైదరాబాద్ నాంపల్లి లోని ప్రజా ప్రతినిధుల మనోరంజన్ కోర్టుకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క హాజరయ్యారు. 2022 జనవరి 4న కొత్తగూడెం జిఆర్ బస్తీ ప్రభుత్వ ఆసుపత్రిలో కోవిడ్ రూల్స్ పాటించకుండా ప్రెస్ మీట్ నిర్వహించారని బట్టి విక్రమార్క తో పాటు ఆరుగురు కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు అయింది. ఆ కేసులో విచారణలో భాగంగా న్యాయమూర్తి ముందు హాజరైయారు.

# నయీం హత్య కేసులో మరో ముగ్గురి అరెస్ట్

### - ప్రధాన సూత్రధారి ఉమామహేష్ సహా ఇద్దరి అరెస్ట్

### - అదుపులో మొత్తం 11 మంది నిందితులు

బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో రౌడీషీటర్ మహమ్మద్ నయీం హత్య కేసులో పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారి సహా ముగ్గురిని నాగోల్ పోలీసులు మంగళవారం రాత్రి అరెస్టు చేశారు. ఖమ్మంకు చెందిన కె.ఉమామహేష్ అలియాస్ జేకే మహేష్ (34), సాయినగర్‌కు చెందిన మహమ్మద్ మున్నా అలియాస్ బోలె (47), ఖమ్మం జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దుగ్గిరాల కార్తీక్ (29)లను ఎల్.బి.నగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 14న బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో నయీమ్‌పై నిందితులు వేటకొడవళ్లతో దాడి చేసి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఈ నెల 16న



ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన సూత్రధారి ఉమామహేష్ మాత్రం అప్పటి నుంచి పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. తాజాగా అతడితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. నయీం, ఉమామహేష్ బాల్య స్నేహితులు. చిన్నతనం నుంచే నేరాలకు పాల్పడటంతో ఇల్లందు పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరిపై రౌడీషీట్లు ఉన్నాయి. కొంతకాలంగా ఇల్లందు, కొత్తగూడెం, ఖమ్మం, హైదరాబాద్ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్లు చేస్తూ ఉండేవారు. ఓ రియల్ ఎస్టేట్ సెటిల్మెంట్లో విభేదాలు రావడంతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండగా, ఉమా మహేష్ ఖమ్మంలో సోలార్ ప్యానల్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. కాగా ఇద్దరి మధ్య ఏర్పడిన విభేదాలు ఒకరిపై ఒకరు కక్ష పెంచుకునేలా దారితీసింది. నయీంను హత్య చేసేందుకు ఈ నెల 13న ఖమ్మంలోని ఓ హోటల్‌లో ఉమా మహేష్ తన అనుచరులతో కలిసి పథకం రచించి మరుసటి రోజు ఖమ్మం నుంచి నిందితులు కారులో హైదరాబాద్‌కు చేరుకున్నారు. మున్నా ద్వారా నయీంకు ఫోన్ చేసి అతడి ఆచూకీ తెలుసుకున్నారు. బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో నయీం ఉన్నట్లు నిర్ధారించుకుని అక్కడికి వెళ్లి అతడి కళ్లలో కారం చల్లి వెంబడించిన నిందితులు.. హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో ఇప్పటికే ఎనిమిది మంది అరెస్టు కాగా.. తాజాగా మరో ముగ్గురి అరెస్టుతో మొత్తం అరెస్టుల సంఖ్య 11కు చేరింది. కాగా ఈ కేసులో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్, ఐపీఎస్ బి.సుమతి ఆదేశాలతో ఎల్.బి.నగర్ డీసీపీ బి.అనురాధ, ఎస్ఓటి ఏసీపీ రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో నాగోల్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పరారీలో ఉన్న నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చేపట్టి ప్రధాన సూత్రధారి ఉమామహేష్‌తో పాటు మరో పదిమంది నిందితులను అరెస్టు చేసినట్లు నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు.

# రాష్ట్రంలోని 14 లక్షల మంది విద్యార్థుల స్కాలర్ షిప్ లు - ఫీజులు వెంటనే చెల్లించాలి

## విద్యానగర్ నుంచి వేలాదిమంది విద్యార్థులతో భారీ ప్రదర్శన

## రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై ఆర్.కృష్ణయ్య ఫైర్



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ సెప్టెంబర్ 23:రాష్ట్రంలో 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల స్కాలర్ షిప్స్, ఫీజుల బకాయిలు 8500కోట్లు వెంటనే విడుదల చేయాలని, ఈ స్కీము ఎత్తివేయాలనే కుట్రలు మానుకోవాలని, ఈ స్కీమును యధాతథంగా పాత పద్ధతిలోనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది విద్యార్థులు నేడు విద్యానగర్ నుంచి భారీ ప్రదర్శన జరిపారు. ఈ ప్రదర్శనకు బిసి సంక్షేమ సంఘం సంఘం జాతీయఅధ్యక్షులు,రాజ్య సభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ స్కీముకు బడ్జెట్ ఇవ్వకుండా ముఖ్యమంత్రి పేద కులాల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. ఫీజుల బకాయిలు ఇవ్వాలని శాంతియుతంగా ఉద్యమాలు చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు చదువుకుంటుంటే కూడా ఓర్వలేక పోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని పేద కులాలు చదువుకోకుండా కుట్రలు చేస్తున్నారని విమర్శించారు.ఈ ఫీజుల బకాయిలు 8500 కోట్లు చెల్లించడం ముఖ్యమంత్రికి ఒకలెక్క కాదు. మూడున్నర సంవత్సరాలుగా విద్యార్థులు పడుతున్న భాదలు చెప్పతరం కాదు. కోర్సు పూర్తి అయిన 6 లక్షల మందికి కాలేజి యాజమాన్యాలు సర్టిఫికేట్లు ఇవ్వడం లేదు. వీరికి ఉద్యోగాలు వచ్చిన చేరలేక - ఉన్నత విద్యకు పోలేక చాల ఇబ్బంది పడుతున్నారు. చదువుతున్న వారి ఫీజులు కట్టే వరకు కాలేజీలకు రానివ్వడంలేదు. ఫీజుల బకాయిలు చెల్లించక పోవడంతో విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ భారీ ప్రదర్శనలో రాష్ట్ర బి.సి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, రాష్ట్ర బి.సి విద్యార్ధి సంఘం రాష్ట్ర కన్వీనర్ నిఖిల్ పటేల్, అధ్యక్షులు పగిళ్ళ సతీష్, బి.సి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి. రాజేందర్, నరేష్ గౌడ్, శివ కుమార్ యాదవ్, రమేష్, రాహుల్, సురేష్, రమణ, కె. వంశీ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# సబ్బులు, షాంపూలు, టూత్పేస్టులపై వెజ్, నాన్వెజ్ గుర్తులు.. కేంద్రం కొత్త నిబంధనలు..




న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 23: సబ్బులు, షాంపూలు, టూత్పేస్టులు, ఇతర సౌందర్య సాధనాలు వంటి ఉత్పత్తుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పు తీసుకొచ్చింది. ఇకపై ఈ ఉత్పత్తుల ప్యాకేజింగ్పై అవి శాకాహార మూలానికి చెందినవా లేదా దూంసాహార మూలానికి చెందినవా అనే విషయాన్ని తెలియజేసే గుర్తులు తప్పనిసరిగా ఉండాలి. కేంద్రం లీగల్ మెట్రాలజీ (ప్యాకేజ్డ్ కమోడిటీస్) రూల్స్, 2011కు సవరణలు చేసి ఈ మార్పును ప్రవేశపెట్టింది

ఈ నిబంధనలు సోమవారం నుంచే అదుల్లోకి వచ్చాయి. ఇకపై, సబ్బులు, షాంపూలు లేదా టూత్పేస్ట్ కొనుగోలు చేసేటప్పుడు ప్యాకేజింగ్పై ఉన్న ఆకుపచ్చ, ఎరుపు లేదా గోధుడు రంగు గుర్తుల ఆధారంగా ఉత్పత్తి మూలాన్ని గుర్తించవచ్చు. శాకాహార మూలానికి చెందిన ఉత్పత్తుల ప్యాకేజింగ్పై ఆకుపచ్చ రంగు ఉంటుంది. మాంసాహార మూలానికి చెందిన ఉత్పత్తులకు ఎరుపు లేదా గోధుడు రంగు గుర్తు ఉంటుంది. ఈ గుర్తును ప్యాకేజీ పైభాగంలో ఉంచాలి ఇప్పటివరకు సబ్బులు, షాంపూలు, టూత్పేస్టుల తయారీలో ఉ పయోగించే పదార్థాల మూలాన్ని తెలుసుకోవాలంటే వినియోగదారులు ప్యాకేజింగ్పై ఉన్న పదార్థాల జాబితాను పరిశీలించాల్సి వచ్చేది కొత్త నిబంధన ప్రకారం, రంగు గుర్తులతో ఉత్పత్తి శాకాహార మూలానికి చెందినదా, మాంసాహార మూలానికి చెందినదా అనే విషయాన్ని సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుంది.

# ఇంటి ముంగిటకే మీసేవ సర్వీసులు

## మంత్రి శ్రీదర్ బాబును అభినందించిన తెలంగాణ మునిసిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఎల్.తాజ్ మొహన్ రెడ్డి

హైద్రాబాద్ సెప్టెంబర్ 23:ఇంటి ముంగిటకే మీసేవ సర్వీసులు పేరిట డోర్ డెలివరీ సర్వీసెస్‌కు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టడం అభినందనీయమని తెలంగాణ మునిసిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు,మాజీ మునిసిపల్ కెమిషనర్ ఎల్.తాజ్ మొహన్ రెడ్డి అన్నారు. ఇంటి ముంగిటకే మీసేవ సర్వీసులు పేరిట డోర్ డెలివరీ సర్వీసెస్ ను ఆర్టీసీ కళ్యాణమండపం లో మంత్రి శ్రీదర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రిని అభినందిస్తూ తాజ్ మొహం రెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించారు.మీసేవ పోర్టల్ ద్వారా స్లాట్‌ను బుక్ చేసుకున్నట్లయితే ఎగ్జిక్యూటివ్ ఇంటి వద్దకే వస్తారు.



ఇంటి వద్దనే జనన లేదా మరణ ధృవీకరణ పత్రాలు, ఆదాయ, కుల, నివాస సర్టిఫికెట్లు,

# తెనాలి రైల్వే స్టేషన్ సమీపంలో విద్యుత్ వైర్లు తెగిపడడంతో రైళ్లకు అంతరాయం

తెనాలి రైల్వే స్టేషన్ సమీపంలో విద్యుత్ వైర్లు తెగిపడడంతో రైళ్లకు అంతరాయం ఏర్పడింది. తెనాలి రైల్వే స్టేషన్ కు ఔటర్ లో గుంటూరు-రేపల్లె రైలు నిలిచిపోయింది. ఘటనతో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రయాణికులు . తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైల్వే సిబ్బంది హుటాహుటిన విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు మరమ్మతు పనులు చేపట్టారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరీక్షల కొరత

## (హెచ్. ప్రతాప్)

ప్రాణం మీదకు వచ్చినప్పుడు వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి పరుగెత్తే పేదవాడికి అక్కడే అవసరమైన పరీక్ష అందకపోతే.. అతడు ఎక్కడికి వెళ్లాలి? రోగ నిర్ధారణ కోసం మరో ఆసుపత్రి తలుపు తట్టాల్సి వస్తే.. అందుబాటులో ఉన్న వైద్యం ఎవరికోసం? తెలంగాణ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసరమైన వైద్య పరీక్షల సౌకర్యాల కొరత ఈ ప్రశ్నలను ముందుకు తెస్తోంది. కోట్లాది మంది ప్రజలకు భరోసాగా నిలవాల్సిన ప్రభుత్వ వైద్య వ్యవస్థలో అత్యాధునిక నిర్ధారణ పరికరాలు అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగించే అంశం.

ఆరోగ్య శాఖ శాసనమండలిలో వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రస్తుతం కేవలం తొమ్మిది ఎంఆర్ఐ యంత్రాలే ఉన్నాయి. సుమారు 3.8 కోట్ల జనాభాకు ఇవే సేవలందిస్తున్నాయి. అంటే సగటున ఒక్క ప్రభుత్వ ఎంఆర్ఐ యంత్రంపై సుమారు 42 లక్షల మంది ఆధారపడాల్సిన పరిస్థితి. మరింత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే.. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 29 జిల్లాల్లో ప్రభుత్వ ఎంఆర్ఐ సౌకర్యమే లేదు. ఈ తొమ్మిది యంత్రాలు కేవలం ఎనిమిది ప్రభుత్వ సంస్థల్లో, నాలుగు జిల్లాల్లోనే ఉన్నాయి. హైదరాబాద్‌లోనే ఆరు యంత్రాలు ఉండగా, మిగిలినవి వరంగల్, ఆదిలాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఉన్నాయి.

ఎంఆర్ఐ పరీక్ష అనేది సాధారణ నిర్ధారణ పరీక్ష కాదు. మెదడు, వెన్నెముక, కీళ్లు, కండరాలు, కొన్ని రకాల కణితులు తదితర అనేక సమస్యలను గుర్తించడంలో ఇది కీలకమైనది. ప్రభుత్వ ఆసుపత్రిలో యంత్రం లేకపోతే రోగి ప్రైవేటు కేంద్రాన్ని ఆశ్రయించాల్సి వస్తుంది. పరీక్ష ఖర్చు, ప్రయాణ వ్యయం, వేచి ఉండే సమయం.. ఇవన్నీ ఆ కుటుంబంపై అదనపు భారమే. అత్యవసర పరిస్థితుల్లో పరీక్ష ఆలస్యం చికిత్సపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది.

ప్రభుత్వ ఆసుపత్రి భవనం పెద్దదిగా ఉండటం కాదు.. అందులో అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉండటమే అసలు ప్రమాణం. అందుకే జిల్లాల వారీగా వైద్య పరికరాల అవసరాలను శాస్త్రీయంగా అంచనా వేసి, అత్యవసర పరీక్షలను స్థానికంగానే అందించేలా చర్యలు తీసుకోవాలి. యంత్రాలు కొనుగోలు చేయడం మాత్రమే సరిపోదు. వాటిని నిర్వహించే సాంకేతిక సిబ్బంది, రేడియాలజిస్టులు, నిరంతర నిర్వహణ, విద్యుత్--మౌలిక వసతులు కూడా సమకూరాలి. పరికరాలు పనిచేయని సమయాన్ని తగ్గించేందుకు కట్టుదిట్టమైన నిర్వహణ వ్యవస్థ అవసరం.

ప్రభుత్వం కొత్త ఎంఆర్ఐ, సీటీ స్కాన్ యంత్రాలను ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో వాటిని అవసరం ఎక్కువగా ఉన్న జిల్లాలకు ప్రాధాన్యంతో కేటాయించడం ముఖ్యం. ప్రతి చిన్న పరీక్ష కోసం జిల్లా ప్రజలు హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి తొలగాలి.

రోగికి పరీక్ష కోసం దూరం ప్రయాణించాల్సిన అవసరం లేకుండా.. వైద్యం అతని గుమ్మానికి చేరువ కావాలి. పరికరాల సంఖ్య పెరగడం మాత్రమే కాదు, అవి పనిచేసే సమయం పెరగాలి. ప్రజారోగ్య వ్యవస్థకు అదే నిజమైన పరీక్ష.

# హరిణి హత్య కేసు నిందితులను శిక్షించాలి

## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

## నిందుతులపట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలి

## తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరావు.

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 23:**జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం గ్రామానికి చెందిన హరిణి ఖమ్మంలో నర్సింగ్ చదువుతూ, ఇటీవల లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగులోని బంధువుల ఇంటికి వచ్చి వెళ్లిన మరుసటి రోజే దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ సమాచారం తెలిసిన వెంటనే కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న ఆయన, మృతదేహాన్ని పరిశీలించి కన్నీరుమున్నీరవుతున్న బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తు ఉన్న ఓ విద్యార్థిని ఇలా దారుణంగా హత్యకు గురికావడం అత్యంత బాధాకరమన్నారు. సమాజంలో మహిళలకు రక్షణ కరువవుతున్న ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు గట్టి నిఘా ఉంచి కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. హరిణి కుటుంబానికి తాము అన్ని విధాలుగా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు ఓదార్పు ఇచ్చారు



# ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాల్లో కేటీఆర్

## సుఖసంతోషాలతో పండుగ జరుపుకోవాలి.. తెలంగాణలో సుభిక్షంగా వర్షాలు కురవాలి

## రైతులు బాగుండాలి.. హైదరాబాద్‌లో ప్రజలంతా శాంతి, సామరస్యంతో జీవించాలి



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్: ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని ఖైరతాబాద్ మహాగణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి చైర్మన్, నిర్వాహకులు, ప్రముఖులు, వేలాది మంది భక్తులు కేటీఆర్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా సుభిక్షంగా వర్షాలు కురవాలని, రైతులు అన్ని విధాలా బాగుండాలని ఆకాంక్షించారు. ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని వినాయకుడిని ప్రార్థించినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో వివిధ కులాలు, మతాలు, వర్గాలకు చెందిన ప్రజలు ఎలాంటి విభేదాలకు తావులేకుండా కలిసిమెలిసి జీవించాలని కేటీఆర్ ఆకాంక్షించారు. నగరంలో శాంతిభద్రతలు, సామరస్యం ఎల్లప్పుడూ కొనసాగాలని కోరుకున్నారు. రాజకీయాలు ఎప్పుడూ ఉంటాయి.. పండుగలు అరుదుగా వస్తాయి అని కేటీఆర్ పేర్కొన్నారు. అందువల్ల రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పండుగలను కుటుంబ సభ్యులు, పిల్లాపాపలతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని కోరారు. వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలకు హాజరైన భక్తులందరికీ, ఉత్సవ నిర్వాహకులకు కేటీఆర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్ర ప్రజలకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ..

## 11వ ఆయుర్వేద దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు

### ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేదం

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 23 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** :ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేదం అనే థీమ్‌తో ఈ ఏడాది ఆయుర్వేద దేను నిర్వహిస్తున్నామని మంత్రి వెల్లడించారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, వ్యాధులను నివారించడం, ఆరోగ్యకరమైన జీవనవిధానాన్నిఅలవర్చుకోవడంవంటిఅంశాలకుఆయుర్వేదంలో, ఎంతో ప్రాధాన్యత ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం లైఫ్‌స్టైల్ సంబంధిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రివెంటివ్ హెల్త్‌కేర్కు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందనిమంత్రి అన్నారు. ఆయుర్వేదం, యోగా ద్వారా ప్రజల్లో ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన పెంచి (ఇల్‌నెస్ టు వెల్‌నెస్) దిశగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఆయుర్వేదం కేవలం వ్యాధులకు చికిత్స అందించే విధానం మాత్రమే కాదని,ఆరోగ్యాన్నికాపాడుకోవడం, పోషకాహారం, వెల్‌నెస్, శరీరం,మనస్సుమధ్య సమతుల్యతకు ప్రాధాన్యతనిచ్చే సమగ్రవిధానమనితెలిపారు. తెలంగాణలో ఆయుష్ వైద్య సేవలను మరింత బలోపేతశీ చేసి,ప్రజలకు చేరువ చేసేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. గత రెండున్నరేళ్లలో సుమారు 700, మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లు నియమించి ప్రజలకు యోగా, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకువచ్చామనిచెప్పారు,ఆయుర్వేదం, హోమియోపతి, యునానివిభాగాల్లో139 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించి ఆయుష్ వైద్య విద్య, బోధన వ్యవస్థను మరింత బలోపేతం చేసినట్లు తెలిపారు .ప్రజలకుమెరుగైన ఆయుష్ వైద్య సేవలు అందించేందుకుసిద్ధిపేట,జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్ జిల్లాల్లో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ హాస్పిటల్స్ ఏర్పాటు చేశామనిమంత్రితెలిపారు. కరీంనగర్‌లో రూ.15 కోట్ల వ్యయంతో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ హాస్పిటల్ నిర్మాణంచేపట్టామనిచెప్పారు.రాష్ట్రంలోనిఆయుష్ హాస్పిటల్స్, క్లినిక్‌లను దశలవారీగా అప్‌గ్రేడ్ చేస్తూ మెరుగైన మౌలిక వసతులు, సేవలు అందించాలని ఆకాంక్షించారు.మన ట్రెడిషనల్ మెడికల్ నాలెడ్జ్‌ను మోడర్న్ రీసెర్చ్, సైంటిఫిక్ ఎవిడెన్స్, టెక్నాలజీతోఅనుసంధానంచేయాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు.ఆయుష్ విద్యార్థులు చదువుతో ఆగిపోకుండా రీసెర్చ్ వైపుకూడాఅడుగులువేయాలని,కొత్తచికిత్సావిధానాలు, ఔషధాలపై పరిశోధనలు చేసి ఆయుష్ వైద్య విధానాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. మన సంప్రదాయ వైద్య విజ్ఞానంలోని బలాన్ని మోడర్న్ రీసెర్చ్ ద్వారా ప్రపంచానికి పరిచయం చేయాల్సిన బాధ్యత యువ




వైద్యులపై ఉందన్నారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలుతీసుకుంటోందన్నారు అయుష్ విద్యార్థులు వైద్యుల అసంక్షేమానికి కూడాప్రభుత్వం ప్రాధాన్యతఇస్తోందనిమంత్రి పేర్కొన్నారు. హౌజ్ సర్జన్స్, పీజీ విద్యార్థుల స్టైఫండ్లను భారీగా పెంచుతూ, ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు, ఇటీవలే హౌజ్ సర్జన్స్ స్టైఫండ్‌ను నెలకు రూ.13,754 నుంచి రూ.29,792కు,పీజీ విద్యార్థుల స్టైఫండ్‌ను రూ.34,385 నుంచి రూ.74,482కు పెంచినట్లు చెప్పారు. ఆయుష్ విద్యార్థులు భవిష్యత్‌లో మంచి వైద్యులుగా ఎదిగి ప్రజలకు మెరుగైన వైద్యులపై ఉందన్నారు.ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆయుష్ వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఆయుష్హాస్పిటల్స్‌లోఅవసరమైన,మందులుఅందుబాటులో, ఉండేలాచూడటంతోపాటు,అర్హతలు,అనుమతలు, లేకుండా ఆయుష్ పేరుతో వైద్య సేవలు అందించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల్లోఆయుష్ వైద్య విధానాలపై మరింత నమ్మకం ,ఆదరణపెరిగేలావైద్యులు,విద్యార్థులు, సిబ్బంది కృషి చేయాలని మంత్రి సూచించారు

## అన్నదానాన్ని ప్రారంభించిన

## మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు.



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 23:** అన్నారుగూడెం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణేష్ ఉత్సవ కమిటీ యువకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తల్లాడ మాజీ ఎంపీపీ శ్రీ దొడ్డ శ్రీనివాసరావు ప్రారంభించి,భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు.

ఈ సందర్భంగా దొడ్డ శ్రీనివాసరావు మాట్లాడుతూ గణపతి ఉత్సవాలు భక్తి,ఆధ్యాత్మికతతో పాటు ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని, యువత సమిష్టిగా ముందుకు వచ్చి అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొడ్ల ప్రభాకర్,ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు,గ్రామ సీనియర్ నాయకులు బొమ్మగాని నాదం, పంచాయతీ సెక్రెటరీ కె వెంకటేశ్వర్లుతో పాటు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు బండి నరసింహారావు, దొడ్డ నరేష్,ఢిల్లీ,సాయి యువకులు,గ్రామ పెద్దలు,భక్తులు పాల్గొన్నారు. యువకులు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శ్రీకారం చుట్టిన నెహ్రూ నగర్ బస్తీ వాసులు:

## ప్లాస్టిక్ గుడ్‌బై.. స్టీలు కే జై!

### ప్లాస్టిక్ రహిత సమాజం -- ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు మార్గం!

### ప్లాస్టిక్‌ను తరిమికొడదాం - ఆరోగ్యాన్ని కాపాడుకుందాం!

**రాజన్న సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 23 , (ప్రజాబలం ప్రతినిధి)** పర్యావరణ హితం, ప్రజారోగ్యమే పరమావధిగా సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూ నగర్ బస్తీ వాసులు ఒక గొప్ప సమాజ హిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సమాజంలో ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగిపోతున్న తరుణంలో, దాని వల్ల కలిగే దుష్ప్రభావాల నుంచి ప్రజలను, పర్యావరణాన్ని కాపాడేందుకు విప్లవాత్మక అడుగు వేశారు.

వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించే అన్నదాన కార్యక్రమాల్లో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. ఇటీవల నిర్వహించిన విరాట్ హిందూ సమ్మేళనంలో స్థానికులు స్వచ్ఛందంగా అందించిన , రూ. 60,000 విరాళాలతో శాశ్వత ప్రాతిపదికన స్టీలు ప్లేట్లు, స్టీలు గ్లాసులు కొనుగోలు చేశారు. ఇకపై బస్తీలో జరిగే ఎలాంటి కార్యక్రమాల్లోనైనా ప్లాస్టిక్ కవర్లు కానీ, ప్లాస్టిక్ ప్లేట్లు కానీ వాడబోమని స్పష్టం చేశారు.



కొనుగోలు చేసిన స్టీలు ప్లేట్లలోనే బుధవారం వీరాంజనేయ సేవా సంఘం ఆధ్వర్యంలో వార్డు ప్రజలందరికీ గణేష్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ రహిత వస్తువులనే వినియోగించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు మనం ఇచ్చే గొప్ప కానుక.. ప్లాస్టిక్ లేని పచ్చని పర్యావరణం. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు మేరుగు మంజుల – శ్రీనివాస్, ఎర్రం వెంకట్రాజం, దూదం రజిని – శ్రీనివాస్, బొద్దుల శ్రీనివాస్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు రాపెల్లి ముకుందం, మడుపు శ్రీకాంత్ రెడ్డి, చిలుక వేణు, వాసాల లక్ష్మీనారాయణ, నెహ్రూ నగర్ బస్తీ వాసులు , వీరాంజనేయ సేవా సంఘ ప్రతినిధులు విశేషంగా పాల్గొన్నారు.

## గణపురం బక్కప్ప ప్రభు మందిరం వినాయక పూజా కార్యక్రమంలో

## పాల్గొన్న మాజీ సర్పంచ్ ఎస్ కల్పనా శంకర్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 23(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం ఘనపూర్ గ్రామంలో వినాయక పూజ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ శివాల కల్పన శంకర్, వినాయకుని ఆశీస్సులతో గ్రామ ప్రజలందరికీ అన్న ప్రసాదం చేయడం జరిగిందని తెలిపారుమాజీ ఎంపిటిసి ఉల్లిగడ్డ బిచ్చన్న, నాగయ్య స్వామి ,రాయిపల్లి నాగన్న ,శివాజీ యూత్ ప్రెసిడెంట్ సుధాకర్, గణనధుని పూజా కార్యక్రమంలో పాల్గొని పూజలు ఘనంగా నిర్వహించి గ్రామాన్ని గ్రామ ప్రజల్ని ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో గ్రామ ప్రజలను దీవించాలని మాజీ ఎంపీటీసీ బి చ్చన్న నాగయ్య స్వామి, రాయిపల్లి నాగన్న, వడ్ల ప్రవీణ్, శివ కుమార్, శివాజీ యూత్ ప్రెసిడెంట్ సుధాకర్, విజయ్, గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో వినాయకుడి ఆశీర్వాదం ఉండాలనిగణనాధునికి మా విన్నపము సమర్పించినామని తెలిపారు

## వేములడలో ఘనంగా గణనాథుని నిమజ్జనం

## కన్నుల పండువగా నిమజ్జన వేడుకలు.. పటిష్ట భద్రతా ఏర్పాట్లు



వేములవాడ, సెప్టెంబర్ 23: వేములవాడ పట్టణంలో తొమ్మిది రోజులుగా భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణనాథుల నిమజ్జన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను భక్తులు, యువకులు, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక వాహనాలపై ఊరేగింపుగా తీసుకువచ్చి గుడి చెరువులో నిమజ్జనం చేశారు.



నిమజ్జన కార్యక్రమానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ అధికారులు గుడి చెరువు వద్ద క్రేన్లు, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యంగా చెరువు భారీ గేట్ల వద్ద అనుకోకుండా ఎవరైనా నీటిలో పడిన సందర్భంలో వెంటనే వారిని రక్షించేందుకు ఫిషరీస్ శాఖ ఆధ్వర్యంలో మత్స్యకారులు (సిమ్మార్లు) ప్రత్యేకంగా అందుబాటులో ఉంచారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా వారికి అవసరమైన సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. అలాగే వేములవాడ బైపాస్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టారు.

నిమజ్జన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ కరీమా అగర్వాల్, ఎస్పీ మహేష్ బిగితే, డీఎస్పీ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గణేశుని నిమజ్జన వేడుకలను ప్రజలంతా ఆనందోత్సాహాలతో, కన్నుల పండువగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణనాథునికి నిమజ్జనం చేస్తున్న ప్రతి ఒక్కరికీ, నియోజకవర్గ ప్రజలందరికీ శ్రీ గణేశుని కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు. ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని గణనాథుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

నిమజ్జన కార్యక్రమం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో వేములవాడ పట్టణంలో సందడి నెలకొంది.

## ఉత్సవ కమిటీ వినాయక నిమజ్జన శోభాయాత్ర .

## కలిశంతో పురవీధులు కలియదిరిగి తల్లాడలో ఘన ఊరేగింపు.



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 23:** వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా తల్లాడ పట్టణంలో శ్రీ కృష్ణ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో కలశంతో ఊరేగింపు బుధవారం ఘనంగా నిర్వహించారు. కమిటీ నేతృత్వంలో జరిగిన ఈ శోభాయాత్రలో నాయకులు, మహిళలు,యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి పారవశ్యంతో ముందుకు సాగారు.

దగ్గుల శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు,భక్తులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని కలశం తలపై ధరించి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. చిన్నారులు,యువత ఉత్సాహంగా పాల్గొనడంతో పట్టణ వీధుల్లో పండుగ వాతావరణం నెలకొంది. వినాయకుడి నామస్మరణలు, భక్తుల సందడితో పురవీధులు మార్మోగాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో కలశాలను మోస్తూ ఊరేగింపులో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో దగ్గుల శ్రీనివాసరెడ్డి,మొక్క కృష్ణార్జున్,మొక్క సత్యనారాయణ, అప్పిరెడ్డి,శ్రీ కృష్ణ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మొక్క నరసింహారావు, అనుమోలు రామకృష్ణ,పెరికె రాము,కొత్తగుల్ల సత్యనారాయణ, ముత్యాలు,సైదారావు, లక్ష్మణ్ బొగ్గవరపు, రాజారావు,గరిదేపల్లి సత్యం,గరిదేపల్లి రాము,మంజుల కృష్ణ,అనుమోలు వంశీ,బొడ్డు బాలకృష్ణ,రాకేష్, సత్యనారాయణ లచ్చి,గ్రామ పెద్దలు, భక్తులు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మణికొండ క్రీడాకారిణి భావన.



**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 23 సెప్టెంబర్ 2026**హిందుస్తాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ బాలనగర్ వారి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 18 నుండి 23 వరకు జరిగిన బాల్ బ్యాడ్మింటన్ శిక్షణా శిబిరంలో తుది వరకూ విశేష ప్రతిభ కనబరిచిన మణికొండ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి కుమారి భావన ఆట అద్భుతంగా ఉందని ప్రేక్షకులు అబినందనలు తెలిపారు. జాతీయ స్థాయి మహిళా బాల్ బ్యాడ్మింటన్ తుది జట్టును ఆల్ ఇండియా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన సలహాదారుడు శ్రీనివాస్ రావు సమక్షంలో ప్రకటించడం, మణికొండ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి భావన తన స్థానాన్ని నిలబెట్టుకోవడం జరిగినధని మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చీఫ్ పాట్రన్ నవీన్ కుమార్, సలహాదారు అందె లక్ష్మణ రావు, ప్రధాన కార్యదర్శి వి. శ్రీనివాస రావు, సభ్యులు హరినాథ్ రెడ్డి, సాయిరామ్, వినయ్, శాస్త్రి, రాంరెడ్డి, టి.శ్రీనివాస రావు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి రమణ మార్గదర్శనంలో మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ క్రీడాకారులు ముందుకు సాగుతున్నరని అందుకు గాను స్థానికు లంధరు రమణకు అభినందనలు తెలపడం జరిగింది. కుమారి భావన గతంలో జాతీయ స్థాయి ఆటలో పాల్గొని స్టార్ ఆఫ్ ఇండియా అవార్డు సాధించడం గమనార్హం. భావన తండ్రి అయిన సీతారామయ్య కూడా జాతీయ స్థాయి క్రీడాకారుడు అవడం ప్రత్యేక ఆకర్షణ. ఎన్నిక కాబడిన మహిళా జట్టు రేపు 24 నుండి 28 వరకు శ్రీ కాళహస్తి లో జరిగే 72 వ జాతీయ స్థాయి పోటీలలో తెలంగాణ టీమ్ తరఫున పాల్గొనడం జరుగుతుందని భావన తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ తనకు ఎంతో ప్రోత్సాహం అందించిన మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ పెద్దలకు తన కృతజ్ఞతలు మరియు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# రూ.11.50 లక్షల విలువైన వైర్లు స్వాధీనం

## 13 కేసుల్లో నిందితులుగా ఉన్న 11 మంది.. తొమ్మిది మంది అరెస్ట్

**జహీరాబాద్, సెప్టెంబర్ 23 ప్రజాబలం ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లాలో గత మూడేళ్లుగా వరుసగా వైర్లు చోరీలకు పాల్పడుతున్న ముఠాను జహీరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. జహీరాబాద్ డీఎస్పీ, జహీరాబాద్ రూరల్ సీఐ పర్యవేక్షణలో హద్నూర్ ఎస్ఐ, సిబ్బంది, క్రైమ్‌టీం సభ్యులు ఓమ్‌దేవ్, అస్లాం, హరినేత్ర, ఆనంద్‌లు కలిసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ ముఠాకు చెందిన 11 మంది 13 చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. వీరి నుంచి సుమారు రూ.11,50,747 విలువైన వైర్లను






స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో తొమ్మిది మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జహీరాబాద్ డీఎస్పీ సైదా తెలిపారు. చోరీల కేసులను ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన హద్నూర్ పోలీసు సిబ్బంది, క్రైమ్‌టీం సభ్యులను డీఎస్పీ సైదా, జహీరాబాద్ రూరల్ సీఐ ప్రత్యేకంగా అభినందించారు.

# బొజ్జ గణపయ్య పూజ నిర్వహించిన బి ఆర్ ఎస్ రాష్ట్ర యువ నాయకుడు కార్తీక్ రెడ్డి.



**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 23 సెప్టెంబర్ 2026.**బుధవారం రోజున మణికొండ శివాజీ నగర్ కాలనీ బాబా అంబేద్కర్ కమ్యూనిటి హాల్ లో పూజలందుకొన్న పార్వతిపుత్ర బొజ్జ గణపయ్యను బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు, రాజేందర్నగర్ పార్టీ ఇంచార్జీ కార్తీక్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు అన్న ప్రసాదం ఏర్పాటు చేయడం వలన భక్తులు పెద్ద ఎత్తున ప్రసాదం గైకొన్నారని నిర్వహకులు తెలిపారు.

## రైతు నమోదు తప్పనిసరి చేసుకోవాలి: మండల వ్యవసాయ అధికారిని లావణ్య

**జహీరాబాద్, సెప్టెంబర్ 23 ప్రజాబలం ప్రతినిధి:** రైతుల వివరాలను సమగ్రంగా నమోదు చేసేందుకు చేపడుతున్న ఫార్మర్ రిజిస్ట్రీలో ప్రతి రైతు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి లావణ్య తెలిపారు. గ్రామంలో రైతు నమోదు ప్రక్రియ కొనసాగుతున్నందున అర్హులైన రైతులందరూ నిర్లక్ష్యం చేయకుండా తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ ఫోన్ వెంట తీసుకుని జహీరాబాద్ పట్టణంలోని భవాని మందిరం సమీపంలోని వ్యవసాయ కార్యాలయానికి రావాలని తెలిపారు. రైతుల భూములు, వ్యక్తిగత వివరాలకు సంబంధించిన సమాచారాన్ని నమోదు చేసే ఈ ప్రక్రియలో ప్రతి రైతు భాగస్వామి కావాలని ఆమె కోరారు. నిర్ణీత సమయంలో నమోదు పూర్తి చేసుకుని ప్రభుత్వ వ్యవసాయ సేవలకు సంబంధించిన ప్రక్రియలో తమ వివరాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు.

## కరెంట్ కోతలతో కాలిపోతున్న ట్రాన్స్ఫార్మర్లు.. ఎండిపోతున్న పైర్లు

సూర్యాపేట పెన్పహాడ్ మండలం గాజుల మల్కాపురం గ్రామంలో ట్రాన్స్ఫార్మర్లు కాలిపోతున్నాయి. దాంతో పైర్లు ఎండిపోతున్నాయని రైతులు మండిపడుతున్నారు. కాలిపోయిన ట్రాన్స్ఫార్మర్లతో రిపేర్ కేంద్రానికి లైన్లు కట్టారు. రోజుకు కేవలం 7-8 గంటలు మాత్రమే కరెంట్ వస్తుందని, అది కూడా 4 విడతలుగా వదలడంతో లో ఓల్టేజ్ సమస్యతో ట్రాన్స్ఫార్మర్లు, మోటార్లు కాలిపోతున్నాయని రైతుల ఆవేదన. పది0 రోజులైనా ట్రాన్స్ఫార్మర్లు రిపేర్ చేయకుండా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీంతో పంటలు ఎండిపోతున్నాయని గోస పెట్టుకుంటున్నారు. పంటలు ఎండిపోయి పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి వచ్చిందని, ప్రభుత్వం ఇకనైనా కోతలు లేకుండా కరెంట్ వదలాలని రైతులు ఆగ్రహం వ్యక్తం చేసారు.

# ఆహార భద్రత నిబంధనలు పక్కాగా అమలు చేయాలి డీఎల్ఏసీ సమావేశంలో అధికారుల ఆదేశం



జిల్లా కేంద్రం, సెప్టెంబరు 23:లి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ జిల్లాలో ఆహార భద్రతా ప్రమాణాల చట్టం (ఎఫ్ఎస్–ఎస్ యాక్ట్) నిబంధనలను కఠినంగా అమలు చేయాలని జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ (డీఎల్ఏసీ) అధికారులను ఆదేశించింది. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో (ఐడీఓసీ) నిర్వహించిన డీఎల్ఏసీ త్రైమాసిక సమీక్ష సమావేశంలో ఆహార భద్రత నియంత్రణ, ఆకస్మిక తనిఖీలు, ప్రజల ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై చర్చించారు. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో నెలకు కనీసం రెండుసార్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, వంటశాలల పరిశుభ్రత, నిల్వ విధానాలను పరిశీలించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రులు, వైద్య కళాశాలల క్యాంటీన్లలో ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర ఆహార విక్రయ కేంద్రాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్య నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వ్యాపార సంస్థలకు నోటీసులు, ఇంప్రూవ్‌మెంట్ లేదా షోకాజ్ నోటీసులు జారీ చేయాలని నిర్ణయించారు. నిర్ణీత గడువు ముగిసిన అనంతరం సంబంధిత సంస్థలను పునఃపరిశీలించి, నిబంధనల అమలును నిర్ధారించాలని ఆదేశించారు.ప్రజల నుంచి అందే ఆహార భద్రతకు సంబంధించిన ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడంతో పాటు, అవసరమైన చోట్ల తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆహార పదార్థాల నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ), జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ), పంచాయతీ అధికారి, జిల్లా ఆహార భద్రత నియమిత అధికారి (ఎఫ్ఎస్ఓ)తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బండి రమేష్‌కు రోజ్‌వుడ్ మహా గణపతి విగ్రహం బహూకరణ ..కిలారు శ్రీనివాసబాబు



**కూకట్పల్లి(ప్రజాబలం)సెప్టెంబర్ 23 :** వినాయక చవితి పర్వదినం సందర్భంగా కూకట్పల్లిలో కాంగ్రెస్ నాయకుల మధ్య ఆత్మీయ వాతావరణం నెలకొంది. పండుగ సందర్భంగా కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్‌ను వసంతనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిలారు శ్రీనివాసబాబు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కారం

బండి రమేష్‌ను శాలువా, పుష్పగుచ్ఛంతో కిలారు శ్రీనివాసబాబు ఘనంగా సత్కరించారు. అనంతరం వినాయక చవితి పర్వదినానికి గుర్తుగా మహా గణపతి రోజ్‌వుడ్ విగ్రహాన్ని బహూకరించారు. గణనాథుడి విగ్రహాన్ని అందజేస్తూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన నాయకులు, కార్యకర్తలు కూడా బండి రమేష్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.పండుగ వేళ ఆత్మీయ కలయిక

వినాయక చవితి సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమం భక్తి, ఆత్మీయతలతో సాగింది. పండుగ నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు ఒకరినొకరు పలకరించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.గణనాథుడి విగ్రహాన్ని బహూకరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని గణనాథుడి విగ్రహాన్ని బహూకరించడం ద్వారా పండుగ స్ఫూర్తిని చాటినట్లు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు తెలిపారు. గణపతి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.సీనియర్ నాయకుల కార్యకర్తల సందడి

ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చావా శ్రీనివాస్, రామారావు, కొఠారి వెంకట్, సురేష్‌మార్, మధుసూదన్, రావూరి శ్రీనివాస్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. పండుగ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

యువ నాయకుల హాజరు

కార్యక్రమంలో యువ నాయకులు నాగాంజనేయులు, హరి ప్రసాద్, అమరేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సీనియర్ నాయకులతో పాటు యువ నాయకులు పాల్గొనడంతో కార్యక్రమం సందడిగా సాగింది. భక్తి.. ఆత్మీయతల కలయిక

వినాయక చవితి పర్వదినం సందర్భంగా నిర్వహించిన సత్కారం, గణపతి విగ్రహ బహూకరణ కార్యక్రమం స్థానిక కాంగ్రెస్ నాయకుల మధ్య ఆత్మీయతను ప్రతిబింబించింది. పండుగ వేళ నాయకులు, కార్యకర్తలు కలుసుకుని శుభాకాంక్షలు తెలుపుకోవడంతో కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో ముగిసింది.

## గణేష్ లడ్డూను అందుకున్న గ్రంధి ప్రవీణ్ కుమార్ వినాయక మందిరం లో అభిషేకం ఘనంగా శోభ యాత్ర



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 23:**వైరా వినాయక మందిరంలో బుధవారం గణేష్ నికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు అనంతరం స్వామివారి లడ్డూను వైరాకు చెందిన ఉమా భవాని ట్రావెల్స్ అధినేత కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రంధి ప్రవీణ్ కుమార్ కు వినాయక మందిరం చైర్మన్ పుప్పాల అనంతరామయ్య సెక్రటరీ రంగా సత్యనారాయణ మాదినేని లక్ష్మణరావు అందించారు. అన్నప్రసాద కార్యక్రమంఅనంతరం వరసిద్ధి వినాయక మందిరం నుండి శోభాయాత్రను ఘనంగా నిర్వహించి నల్లచెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ ఉపేందర్ రావు మిట్టపల్లి నాగి రంగా వాసవి పుప్పాల లావణ్య ఏడు నూతల మోదుగు లక్ష్మయ్య రంగా సింహాద్రి దంపతులు రాయపుడివెంకటేష్ రజని దంపతులు నాళ్ళ నాగేశ్వరరావు మల్లీశ్వరిసుగ్గల విజయ్ మాధవి నల్లమోతు లక్ష్మీనారాయణ శోభ దంపతులుతదితరులు పాల్గొన్నారు

# బండి రమేష్‌కు రోజ్‌వుడ్ మహా గణపతి విగ్రహం బహూకరణ ..కిలారు శ్రీనివాసబాబు



**కూకట్పల్లి(ప్రజాబలం)సెప్టెంబర్ 23 :** వినాయక చవితి పర్వదినం సందర్భంగా కూకట్పల్లిలో కాంగ్రెస్ నాయకుల మధ్య ఆత్మీయ వాతావరణం నెలకొంది. పండుగ సందర్భంగా కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్‌ను వసంతనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిలారు శ్రీనివాసబాబు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కారం

బండి రమేష్‌ను శాలువా, పుష్పగుచ్ఛంతో కిలారు శ్రీనివాసబాబు ఘనంగా సత్కరించారు. అనంతరం వినాయక చవితి పర్వదినానికి గుర్తుగా మహా గణపతి రోజ్‌వుడ్ విగ్రహాన్ని బహూకరించారు. గణనాథుడి విగ్రహాన్ని అందజేస్తూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన నాయకులు, కార్యకర్తలు కూడా బండి రమేష్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ వేళ ఆత్మీయ కలయిక

వినాయక చవితి సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమం భక్తి, ఆత్మీయతలతో సాగింది. పండుగ నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు ఒకరినొకరు పలకరించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గణనాథుడి విగ్రహాన్ని బహూకరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని గణనాథుడి విగ్రహాన్ని బహూకరించడం ద్వారా పండుగ స్ఫూర్తిని చాటినట్లు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు తెలిపారు. గణపతి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. సీనియర్ నాయకుల కార్యకర్తల సందడి

ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చావా శ్రీనివాస్, రామారావు, కొఠారి వెంకట్, సురేష్‌మార్, మధుసూదన్, రావూరి శ్రీనివాస్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. పండుగ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

యువ నాయకుల హాజరు

కార్యక్రమంలో యువ నాయకులు నాగాంజనేయులు, హరి ప్రసాద్, అమరేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సీనియర్ నాయకులతో పాటు యువ నాయకులు పాల్గొనడంతో కార్యక్రమం సందడిగా సాగింది. భక్తి.. ఆత్మీయతల కలయిక

వినాయక చవితి పర్వదినం సందర్భంగా నిర్వహించిన సత్కారం, గణపతి విగ్రహ బహూకరణ కార్యక్రమం స్థానిక కాంగ్రెస్ నాయకుల మధ్య ఆత్మీయతను ప్రతిబింబించింది. పండుగ వేళ నాయకులు, కార్యకర్తలు కలుసుకుని శుభాకాంక్షలు తెలుపుకోవడంతో కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో ముగిసింది.

# తల్లిదండ్రులే విశ్వరూపమని తెలియజేసిన ‘ వినాయకుడు పూజనీయుడు - బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

### విఘ్నాలను తొలగించే ఆది దేవుడు గణపయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలి.. శ్రీరంగం.



**కూకట్పల్లి (ప్రజాబలం ) సెప్టెంబర్ 23:** నవయువక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూసాపేట్ మహాగణపతి మండపనికి బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు ఆహ్వానం మేరకు టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ విచ్చేసి కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్, పీసీసీ సభ్యులు,టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగంతో కలిసి లంబోదరుడికి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజాపాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగేందుకు ఎలాంటి అవరోధాలు లేకుండా అన్ని విఘ్నాలు తొలగించాలని స్వామివారిని ప్రార్థించడం జరిగింది అన్నారు. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో కొనసాగుతున్న సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులకు మరియు భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు పి. నాగిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొండకింద పుష్పారెడ్డి, కాంటెస్టెడ్ కార్పొరేటర్లు యాదగిరి, గోపిశెట్టి రాఘవేందర్, ఏ, బి బ్లాక్ మహిళా అధ్యక్షురాళ్లు రమాదేవి, సంధ్య,డివిజన్ ల అధ్యక్షులు, మహిళా నాయకురాళ్లు, సీనియర్ నాయకులు, అసోసియేషన్ సభ్యులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వర్షాన్ని లెక్కచేయకుండా.. ఇంటింటా పెన్షన్ల పరిశీలన అర్హులందరికీ చేయూత పెన్షన్ అందించడమే లక్ష్యం



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 23:** ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నా.. అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పెన్షన్ అందించాలనే లక్ష్యంతో వేంసూరు గ్రామంలో నూతన పెన్షన్ దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. సర్పంచ్ ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో మండల అధికారులు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించారు.

నూతనంగా దరఖాస్తు చేసుకున్న వితంతు, వికలాంగులు, వృద్ధాప్య పెన్షన్ దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లిన మండల ఈఓఆర్డీఓ రంజిత్ కుమార్.. దరఖాస్తుదారుల అర్హతలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత, అనర్హత వివరాలను నమోదు చేశారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టడం పట్ల దరఖాస్తుదారులు హర్షం వ్యక్తం చేశారు.

పెన్షన్ దరఖాస్తు చేసుకున్న వారందరూ పరిశీలన పూర్తయ్యే వరకు తమ ఇళ్లలోనే అందుబాటులో ఉండాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై సర్పంచుల ఆగ్రహం

### గ్రామాల్లో విద్యుత్ సమస్యలు.. రైతులకు శాపంగా మారిన అప్రకటిత కోతలు

### సమస్యలు పరిష్కరించకుంటే ఉన్నతాధికారులను ఆశ్రయిస్తాం: సర్పంచులు



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 23:** వేంసూరుమండల విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాల్లో విద్యుత్ సమస్యలు నెలల తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామసభలు, పంచాయతీ సమావేశాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. రెండు రోజుల్లో పరిష్కరిస్తామని హామీలు ఇవ్వడం తప్ప క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారంపై సర్పంచులు, విద్యుత్ శాఖ ఏడీఈ, ఏఈలతో ఎంపీడీవో కావ్య బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగపాలెం సర్పంచ్ యర్రా రమేష్, కందుకూరు సర్పంచ్ మందపాటి వెంకటరెడ్డి, భీమవరం సర్పంచ్ వంట్ల రమేష్ మాట్లాడుతూ.. తమ గ్రామాల్లో నెలలుగా విద్యుత్ సమస్యలు కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఈ దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా కాలయాపన చేస్తున్నారని, ఏడీఈకి ఫిర్యాదు చేసినా ఏఈతో మాట్లాడి పరిష్కరిస్తానని చెప్పడం తప్ప పనులు ముందుకు సాగడం లేదన్నారు.

ధర్నా చేసినా.. పరిష్కారం కాని సమస్యలు

వారం రోజుల క్రితం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో కందుకూరు సబ్‌స్టేషన్ వద్ద రైతులు విద్యుత్ సమస్యలపై ధర్నా నిర్వహించిన విషయాన్ని సర్పంచులు ప్రస్తావించారు. కందుకూరు, వెంకటాపురం, లచ్చన్నగూడెం, మర్లపాడు, భరిణపాడు, దుద్దేపూడి గ్రామాలకు చెందిన రైతులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు.

త్రీ ఫేస్ సరఫరా సక్రమంగా లేక ఇబ్బందులు

గ్రామాల్లో త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా ఆరు, ఏడు గంటలకు మించి ఉండటం లేదని, వచ్చిన విద్యుత్ కూడా తరచూ అంతరాయం కలుగుతుండటంతో తాగునీటి సరఫరాకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని సర్పంచులు తెలిపారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో వ్యవసాయ పనులు దెబ్బతింటున్నాయని, పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని రైతుల ఇబ్బందులను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.


ఏడీఈ తరచూ మండలంలో పర్యటిస్తున్నప్పటికీ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తన దృష్టికి రాలేదని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. సమావేశాల్లో హామీలు ఇవ్వడం కాకుండా క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఉన్నతాధికారులను ఆశ్రయిస్తాం

ఇదే పరిస్థితి కొనసాగితే వరంగల్‌లోని ఉన్నత విద్యుత్ శాఖ అధికారుల కార్యాలయానికి వెళ్లి సమస్యలను వివరిస్తామని సర్పంచులు హెచ్చరించారు. దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ ఏడీఈ త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సమావేశంలో వేంసూరు సర్పంచ్ ఎండీ ఫక్రుద్దీన్, కల్లూరుగూడెం సర్పంచ్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆహార భద్రత నిబంధనలు పక్కాగా అమలు చేయాలి డీఎల్‌ఏసీ సమావేశంలో అధికారుల ఆదేశం



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, సెప్టెంబరు 23:** ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ జిల్లాలో ఆహార భద్రతా ప్రమాణాల చట్టం (ఎఫ్ఎస్ఎస్ యాక్ట్) నిబంధనలను కఠినంగా అమలు చేయాలని జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ (డీఎల్‌ఏసీ) అధికారులను ఆదేశించింది. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో (ఐడీఓసీ) నిర్వహించిన డీఎల్‌ఏసీ త్రైమాసిక సమీక్ష సమావేశంలో ఆహార భద్రత నియంత్రణ, ఆకస్మిక తనిఖీలు, ప్రజల ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై చర్చించారు.

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో నెలకు కనీసం రెండుసార్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, వంటశాలల పరిశుభ్రత, నిల్వ విధానాలను పరిశీలించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రులు, వైద్య కళాశాలల క్యాంటీన్లలో ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర ఆహార విక్రయ కేంద్రాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్య నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వ్యాపార సంస్థలకు నోటీసులు, ఇంప్రూవ్‌మెంట్ లేదా షోకాజ్ నోటీసులు జారీ చేయాలని నిర్ణయించారు. నిర్ణీత గడువు ముగిసిన అనంతరం సంబంధిత సంస్థలను పునఃపరిశీలించి, నిబంధనల అమలును నిర్ధారించాలని ఆదేశించారు.

ప్రజల నుంచి అందే ఆహార భద్రతకు సంబంధించిన ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడంతో పాటు, అవసరమైన చోట్ల తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆహార పదార్థాల నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.

సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ), జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ), పంచాయతీ అధికారి, జిల్లా ఆహార భద్రత నియమిత అధికారి (ఎఫ్ఎస్ఓ)తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి అభివృద్ధి సమీక్షా సమావేశం

### పాల్గొన్న మంత్రి కొలుసు పార్థసారధి

బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి అభివృద్ధి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి, స్థానిక శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, జిల్లా కలెక్టర్ , ఎస్పీ జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల కల్పన వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు సకాలంలో చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని దిశానిర్దేశించారు. అలాగే బాపట్ల జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి అడుగులు వేయాలని, టూరిజం రంగానికి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చి జిల్లాను అన్ని విధాలా ముందుంచాలని అధికారులను ఆదేశించారు.

# టైరు పేలి అదుపు తప్పి బోల్తా పడిన ఏపీఎస్‌ఆర్టీసీ బస్సు

అన్నమయ్య ఏపీఎస్‌ఆర్టీసీ బస్సు టైరు పేలి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వెంకటేశ్వరరావుతో సహా 20 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. వాల్మీకిపురం మండలం విఠలం సమీపంలోని మదనపల్లి- తిరుపతి జాతీయ రహదారిపై ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికులు క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

# దార్లపల్లి వినాయక పూజ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాల్ రాజు



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 23 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం దార్లపల్లి గ్రామంలో వినాయక పూజా కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాల్ రాజు పాల్గొన్నట్టు తెలిపారు, వినాయక పండుగ సందర్భంగా గ్రామ పెద్దలకు గ్రామ ప్రజలకు చిన్నలకు పెద్దలకు ప్రతి ఒక్కరికి ప్రేమతో వినాయక పూజా కార్యక్రమానికి ఆహ్వానించి పూజ అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ తెలిపారు అన్నదాన కార్యక్రమం అనంతరం వినాయక నిమజ్జనం ఉంటుందని కార్యక్రమంలో చిన్నలు పెద్దలు గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతంగా పండుగ సంబరాలు జరుపుకోవాలని గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాల్ రాజు, గ్రామ పెద్దలు వార్డు మెంబర్లు కార్యక్రమంలో పాల్గొన్నట్టు తెలిపారు



# పట్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని చుట్టుపక్కల గ్రామాలవారు పూర్తి స్థాయిలోసద్వినియోగంచేసుకుటున్నారని డాక్టర్ శంకరయ్యతెలిపారు



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 23 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చుట్టుపక్కల గ్రామాల వారు పూర్తిస్థాయిలో సర్ది దగ్గు ఆయాసం కాళ్ల నొప్పులు జ్వరం ఇలా ఉన్నవారు పూర్తిస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి నట్లు తెలిపారుప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు టాబ్లెట్ ఇంజక్షన్స్ అవసరమైన వారికి సిరప్స్ ఇస్తున్నారని తెలిపారు నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ ఆసుపత్రిలో దేవాలయాలని కొందరు ప్రజలు తెలిపారు కొన్ని పెద్ద కుటుంబాల్లో అందరూ ఉన్న ఎవరూ పట్టించుకోలేని స్థితిలో ఉన్నటువంటి వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి బీపీ షుగర్ పెయిన్స్ టాబ్లెట్స్ ప్రజలకు అందుబాటులో ఉన్నాయని ప్రజలు పూర్తిస్థాయిలో ప్రైమరీ హెల్త్ సెంటర్ ని సద్వినియోగం చేసుకుంటున్నారని డాక్టర్ శంకరయ్య తెలిపారు

# పట్లూర్ పింఛన్ వెరిఫికేషన్ లో పాల్గొన్న ఎంపీ ఓ గ్రామ సర్పంచ్ పరశురాం, స్మార్ట్ కార్డు పంపిణీ

**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 23 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ సివిల్ సప్లై స్మార్ట్ కార్డ్స్ మరియు పింఛన్ వెరిఫికేషన్ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్,పట్లూరు గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచ్ పరుశు రాం ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ పరుశురాం తెలిపారు స్మార్ట్ కార్డు పంపిణీ పింఛన్ వెరిఫికేషన్



కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎం పి ఓ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ పరుశురాం, మాజీ ఎంపీటీసీ సురేష్, మహేష్, ఉప సర్పంచ్ అఖిల్ గ్రామ సెక్రెటరీ గోపాల్ గ్రామ పెద్దలు లబ్ధిదారులు కార్యక్రమంలో పాల్గొన్నారు కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒక్కొక్కటిగా అన్ని కార్యక్రమాలు సజావుగా ప్రజలకు అందేలా కృషి చేస్తుందని ఇంకా మిగిలిన అన్ని సంక్షేమ పథకాలు కూడా వెనువెంటనే ఒక్కొక్కటి ప్రారంభించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం అని గ్రామ సర్పంచ్ పరుశురాం, మాజీ ఎంపిటిసి సురేష్, స్పెషల్ ఆఫీసర్ మేడం, యువ నాయకుడు నందు ప్రకాష్, కారోబర్లు లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు

# నాగోల్ లో బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో మేగా రక్తదాన శిబిరం పాల్గొన్న ఎంపి ఈటల

మేడ్చల్ ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాక్షేత్రంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభసందర్భంగా, దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "సేవా సంకల్ప్ అభియాన్"లో భాగంగా ఈరోజు భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో నాగోల్ లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో ఎంపి ఈటల రాజేందర్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్ర శేఖర్జి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎంపి ఈటల మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోదీ 77వ వసంతంభలోకి అడుగుపెట్టారు. 25 ఏళ్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా వారు అందించిన సేవలు దేశం గర్వపడుతుంది. రతజాతి కులాలు మతాలు ప్రాంతాలకు అతీతంగా ఆయన్ని గుర్తించి గౌరవిస్తుంది. ప్రపంచ చిత్రపటం మీద దేశ ఔన్నత్యాన్ని మోదీ రు పెంచారు అనడంలో సందేహం లేదని అన్నారు.

భారతదేశం సొంత కాళ్ళ మీద నిలబడి మోడ్రన్ రైల్వే సిస్టం, ఎయిర్పోర్టు, వేల కిలోమీటర్ల జాతీయ రహదారులు ఏర్పాటు చేస్తున్నారు. మౌలిక సదుపాయాల కోసం 2014 కంటే ముందు 2 లక్షల కోట్ల రూపాయల ఖర్చు చేస్తే ఇప్పుడు 15 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నాం. దేశాన్ని గొప్పగా తీర్చిదిద్దుతున్నారు. ఆయన ఎప్పుడూ నేను పాలకున్ని అని అనరు, సేవకున్ని మాత్రమే అని చెప్తారు.

76 సంవత్సరాల వయసులో కూడా ఒక్కరోజు కూడా సెలవు లేకుండా నిరంతరం యంత్రంలాగా పనిచేస్తూ దేశాన్ని ముందుకు తీసుకుపోతున్న మోదీ గారు మరింత ఆరోగ్యవంతంగా ఉండి, ప్రజల ఆశీర్వాదం పొంది, భగవంతుని దయతో మరింత సేవా అందించాలని కోరుతున్నామని అన్నారు. ఈరోజు బీజేవైయం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించాము. ఇందులో పాల్గొని రక్త దానం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలని అన్నారు.

# తిరుమలలో వైభవంగా చక్రస్నానం.. ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

**శ్రీవారి బ్రహ్మోత్సవాల ముగింపు**
**నేడు చక్రస్నానం**
**పవిత్ర పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించిన వేలాది మంది భక్తులు**
**మలయప్ప స్వామి, సుదర్శన చక్రత్తాళ్వార్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం**
**8 రోజుల్లో 5.76 లక్షల మందికి శ్రీవారి దర్శనం కల్పించినట్లు తెలిపిన టీటీడీ**
**సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో ఉత్సవాలు**
**విజయవంతం చేశామన్న బీఆర్ నాయుడు**

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు బుధవారం నాడు చక్రస్నానంతో కన్నులపండువగా ముగిశాయి. సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన ఈ ఉత్సవాల చివరి రోజున స్వామి పుష్కరిణిలో నిర్వహించిన చక్రస్నానం ఘట్టంతో బ్రహ్మోత్సవాలకు పరిసమాప్తి పలికారు.



అంతకుముందు, ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకు శ్రీవారికి సర్వభూపాల పల్లకి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు శ్రీ భూవరాహ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామికి, సుదర్శన చక్రత్తాళ్వార్‌కు వైఖానస ఆగమోక్తంగా స్నపన తిరుమంజనం చేపట్టారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో శంఖులు, కలశాల ద్వారా అభిషేకం చేశారు. ఈ సమయంలో వేద పండితులు ఉపనిషత్తులు, పంచ సూక్తాలు (పురుష, శ్రీ, భూ, నీలా, విష్ణు) పఠించగా, జీయర్ స్వాముల సమక్షంలో దివ్య ప్రబంధ పారాయణం నిర్వహించారు.

అభిషేకం అనంతరం, సుదర్శన చక్రత్తాళ్వార్‌ను ఊరేగింపుగా స్వామి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి, వేదమంత్రాల ఘోష నడుమ పవిత్ర జలాల్లో స్నానం చేయించారు. అదే శుభ సమయంలో, "గోవిందా... గోవిందా..." అంటూ భక్తి పారవశ్యంతో నామస్మరణ చేస్తూ, పుష్కరిణి వద్ద వేచి ఉన్న వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సుదర్శన చక్రం స్పృశించిన జలాల్లో స్నానం చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఆగమశాస్త్రం ప్రకారం, బ్రహ్మోత్సవాలను ఒక మహాయజ్ఞంగా పరిగణిస్తారు. ఉత్సవాల నిర్వహణలో ఏవైనా లోటుపాట్లు జరిగితే, ఈ చక్రస్నానం (అవభృథ స్నానం) ద్వారా అవి తొలగిపోయి, భక్తులకు, లోకానికి సంపూర్ణ ఫలం, శాంతి, శ్రేయస్సు కలుగుతాయని నమ్మకం.

**విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు: టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు**

ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నిరంతర మార్గదర్శకత్వంతోనే బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యాయని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, వసతి, అన్నప్రసాదం, పారిశుద్ధ్యం, భద్రత వంటి అంశాలపై సీఎం సూచనలతో క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. గత 8 రోజుల్లో 5.76 లక్షల మంది భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించామని, ప్రతి భక్తుడు సంతృప్తిగా దర్శనం చేసుకునేలా సమష్టిగా పనిచేశామని వివరించారు.

ఈ విజయానికి సహకరించిన అర్చకులు, అధికారులు, ఉద్యోగులు, పోలీసులు, జిల్లా యంత్రాంగం, శ్రీవారి సేవకులు, మీడియా ప్రతినిధులు సహా ప్రతి ఒక్కరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సేవే తమ ప్రథమ కర్తవ్యమని, శ్రీవారి ఆశీస్సులతో భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# ప్రశాంత గణేష్ నిమజ్జన శోభాయాత్రకై పోలీసుల మార్గదర్శకాలు: బాలానగర్ ఏసీపీ




**కూకట్పల్లి (ప్రజాబలం ) సెప్టెంబర్ 23:** గణేష్ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా భక్తులు, మండప నిర్వాహకులు పలు ముఖ్యమైన జాగ్రత్తలు పాటించాలని బాలానగర్ ఏసీపీ (ఏసీపీ ) పింగిలి నరేష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శోభాయాత్ర ప్రశాంతంగా, సురక్షితంగా, ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ముగిసేందుకు.. భద్రత, పౌర సదుపాయాల పర్యవేక్షణ కోసం సైబరాబాద్ పోలీస్ సుమారు 200 మందిపైగా పోలీసు సిబ్బందిని మోహరించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు, నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని కోరారు.

సైబరాబాద్ పోలీస్, సిఎంసీ, హైడ్రా, టిజిఎస్పీడీసీఎల్, జలమండలి సమన్వయంతో చేపట్టిన నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా, సురక్షితంగా ముగిసేందుకు, ?శాంతిభద్రతలు, ట్రాఫిక్ నిర్వహణ దృష్ట్యా నిర్వాహకులకు పోలీసుల ముఖ్యమైన, కీలక మార్గదర్శకాలు చేశారు. మండపాల వద్ద నిర్వహించే అన్నదానాలు, లడ్డూ వేలం, ఇతర కార్యక్రమాలను వీలైనంత త్వరగా పూర్తి చేసుకోవాలి. ఉదయం 10' గంటల నుంచి మధ్యాహ్నం 12' గంటల మధ్యలోనే శోభాయాత్రను ప్రారంభించి, ఆలస్యం చేయకుండా అధికారులు నిర్దేశించిన నిమజ్జన ప్రదేశానికి చేరుకోవాలన్నారు.

విగ్రహాల తరలింపు మార్గంలో విద్యుత్ వైర్లు, చెట్ల కొమ్మలు లేదా ఇతర అడ్డంకులు ఉంటే ముందుగానే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేసి వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శోభాయాత్రలో హైకోర్టు ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. డీజేల వినియోగం పూర్తిగా నిషేధం. ఎలాంటి నిబంధనల ఉల్లంఘన జరగకుండా నిర్వాహకులు పూర్తి బాధ్యత వహించాలని హెచ్చరించారు. విగ్రహాలను తరలించే వాహనాల కండిషన్‌ను, ?వాహన ఫిట్‌నెస్ ముందుగానే తనిఖీ చేసుకోవాలన్నారు. చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న అనుభవజ్ఞులైన డ్రైవర్లను మాత్రమే వాహనాలు నడిపేందుకు అనుమతించాలన్నారు.

ప్రతి విగ్రహం వెంట బాధ్యత కలిగిన నిర్వాహకులు తప్పనిసరిగా ఉండాలని. రహదారులపై అనవసరంగా వాహనాలు నిలిపివేయకుండా, సాధారణ ప్రజలకు, ఇతర వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.ప్రజల భద్రత కోసం, విస్తృతమైన అత్యవసర ప్రతిస్పందన చర్యలు చేపట్టబడ్డాయని. నీటిలో నిమజ్జన ప్రక్రియను సురక్షితంగా నిర్వహించడానికి, సైబరాబాద్ పోలీస్, హైడ్రా (హైడ్రా) అన్ని ప్రధాన సరస్సుల వద్ద ప్రత్యేక నైపుణ్యం గల ఈతగాళ్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ?నిమజ్జనం సమయంలో క్రేన్ కింద ఎవరూ నిలబడటం చేయకూడదు, ?చెరువులు లేదా ట్యాంక్‌లలోకి ఎవరూ నేరుగా దిగకూడదని సూచించారు. ?పూజా సామగ్రి, పూలను నీటిలోకి వెళ్లి వేయకుండా నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్త వహించాలన్నారు.

?నిమజ్జనం పూర్తయ్యే వరకు ప్రదేశంలో ఉండే పోలీసుల సూచనలను కచ్చితంగా పాటించాలని. ?25న పెద్ద సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉన్నందున, ప్రతి ఒక్కరూ మత సామరస్యానికి ప్రతీకగా,శాంతియుత వాతావరణంలో బాధ్యతాయుతంగా వ్యవహరించి, పోలీస్ శాఖకు సహకరించి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఏసీపీ విజ్ఞప్తి చేశారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com